epaper : tmedia.net.in
GSTIN-NO:36FDKPS1308P1ZX , Regd. No. 100/20
# టి-మీడియా
సామాజికం... ప్రజల పక్షం
MEDIA
మెయిన్ : శుక్రవారం- అక్టోబర్ 13- 2023 - పేజీలు - 4

## ఈసీ బదిలీ చేసిన పోస్టులకు -ప్యానెల్ పంపిన రాష్ట్ర ప్రభుత్వం..



**టీ మీడియా, అక్టోబర్ 12,హైదరాబాద్ :** ఈసీ బదిలీ చేసిన పోస్టులకు రాష్ట్ర ప్రభుత్వం ప్యానెల్ పంపింది. ఒక్కో పోస్టుకు ముగ్గురు చొప్పున పేర్లను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి కేంద్ర ఎన్నికల సంఘానికి పంపారు. నలుగురు కలెక్టర్లు, ముగ్గురు సీపీలు, 10 మంది ఎస్పీ పోస్టులకు, రవాణా, ఎక్సైజ్, వాణిజ్య పన్నుల శాఖల కార్యదర్శుల పోస్టులకు, ఎక్సైజ్, వాణిజ్య పన్నుల కమిషనర్ల పోస్టులకు ప్యానెల్ పంపారు. ప్యానెల్ నుంచి ఒక్కొక్కరిని కేంద్ర ఎన్నికల సంఘం ఎంపిక చేయనుంది. వచ్చే నెలలో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న ఐదు రాష్ట్రాల్లో కేంద్ర ఎన్నికల కమిషన్ భారీ ఎత్తున సీనియర్ అధికారులను బదిలీ చేసింది. బదిలీ అయిన వారిలో కలెక్టర్లు, పోలీస్ అధికారులు ఉన్నారు. తెలంగాణలో రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి, యాదాద్రి భువనగిరి, నిర్మల్ జిల్లాల కలెక్టర్లతో పాటు 13 మంది పోలీసు అధికారులు ఉన్నారు.

## గుట్టలు గుట్టలుగా..
# నోట్ల కట్టలు

**-కేజీల కొద్ది బంగారం, వెండి**
**-మూడు రోజుల వ్యవధిలో 10 కోట్లు సీజ్**



**టి మీడియా, అక్టోబర్ 12,హైదరాబాద్:** తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికల నగరా మోగింది.. వెను వెంటనే ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో హైదరాబాద్ సహా పలు జిల్లాల్లో పోలీసులు ముమ్మర తనిఖీలు చేపట్టారు. ఎన్నికల్లో డబ్బు, మద్యం పంపిణీని అరికట్టేందుకు ఎక్కడికక్కడ చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి ముమ్మరంగా సోదాలు నిర్వహిస్తున్నారు. ఎలాంటి పత్రాలు, ఆధారాలు లేకుండా తరలిస్తున్న నగదు, బంగారం, వెండి, మద్యం ఇతర వస్తువులను భారీగా స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వాటిని ఆదాయపన్ను శాఖ అధికారులకు అప్పగించారు పోలీసులు. ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే ఉపేక్షించబోమని పోలీసులు హెచ్చరిస్తున్నారు. ఎలక్షన్ కోడ్ అమల్లోకి వచ్చిన మూడు రోజుల వ్యవధిలో 10 కోట్ల రూపాయలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. హైదరాబాద్ బంజారాహిల్స్‌లో రూ.3.35 కోట్లు స్వాధీనం చేసుకున్నారు. బషీర్‌బాగ్ నిజాం కళాశాల వద్ద వాహన తనిఖీల్లో ఓ బంగారం దుకాణానికి చెందిన, ఎలాంటి పత్రాల్లేని 7 కిలోల బంగారం, 295 కిలోల వెండిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ రూ.7.5 కోట్లు ఉంటుందని పోలీసులు తెలిపారు. పురానాపూల్ వద్ద బేగంబజార్‌కు చెందిన ఒకరి నుంచి రూ.15 లక్షలు స్వాదీనం చేసుకున్నారు. హైదరాబాద్‌లోని చైతన్యపురి పరిధిలో బైక్‌పై వెళుతున్న ఇద్దరు వ్యక్తుల నుంచి ఆధారాల్లేకుండా తరలిస్తున్న రూ.25 లక్షలను స్వాదీనం చేసుకున్నారు. అదే ప్రాంతంలో షాద్‌నగర్‌కు చెందిన స్క్రాప్ వ్యాపారి సంతోష్ చంద్రశేఖర్ నుంచి రూ. 5 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. హైదరాబాద్‌లో టాస్క్‌ఫోర్స్ అధికారులు కూడా భారీగా నగదును స్వాధీనం చేసుకున్నారు. టాస్క్ ఫోర్స్ తనిఖీల్లో రూ.మూడు కోట్ల పైచిలుకు నగదు పట్టుబడింది. హవాల రూపంలో డబ్బులు తరలిస్తున్న ముఠాగా పోలీసులు అనుమానిస్తున్నారు. అంతేకాకుండా చందానగర్‌లో సైతం ఆరు కేజీల బంగారం పట్టుబడింది.

సైబరాబాదు పరిధిలో మూడు కోట్ల రూపాయల నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. చందానగర్‌లో 5.5 కేజీల బంగారం తనిఖీల్లో పట్టుబడింది. రంగారెడ్డి జిల్లా లాల్‌పహాడ్ చౌరస్తా వద్ద తనిఖీల్లో 2 కిలోల బంగారం, రూ.1.22 లక్షలు పట్టుబడ్డాయి. ఆగాపురా హామీద్ కేఫ్ చౌరస్తాలో షాహీన్ నగర్‌కు చెందిన మహ్మద్ అబ్దుల్ నుంచి రూ. 5 లక్షలు, బేగంబజార్‌కు చెందిన దినేష్ ప్రజాపతి నుంచి రూ.12 లక్షల నగదు స్వాదీనం చేసుకున్నారు పోలీసులు.. షేక్‌పేట నారాయణమ్మ ఇంజనీరింగ్ కాలేజ్ కారులో తరలిస్తున్న రూ. 30 లక్షలు సీజ్ చేశారు. వనస్థలిపురం పరిధిలో ఓ కారులో సంరెడ్డి భరత్‌రెడ్డి తీసుకెళ్తున్న రూ. 5.16 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. గోపాలపురం పీఎస్ పరిధిలోని ఓ లాడ్జీలో చేపట్టిన తనిఖీల్లో 4 లక్షలు పట్టుబడ్డాయి. పంచశీల క్రాస్ రోడ్స్ వద్ద గోపి అనే వ్యక్తి నుంచి రూ. 9.3 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి బీడీఎల్ చౌరస్తా వద్ద తనిఖీల్లో కారులో తరలిస్తున్న రూ.9,38,970తో పాటు గాయత్రి ఆస్పత్రి వద్ద తనిఖీల్లో మరో కారులో తరలిస్తున్న రూ.71,50,000 నగదును పోలీసులు పట్టుకున్నారు. అలాగే షాద్‌నగర్ టోల్ ప్లాజా వద్ద సంగారెడ్డికి చెందిన నగేష్ నుంచి రూ.7 లక్షలతోపాటు షాద్‌నగర్‌లోని జీహెచ్‌ఆర్ కాలనీకి చెందిన అశోక్ బైక్‌పై తీసుకెళ్తున్న రూ. 11.50 లక్షలను సీజ్ చేశారు. నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లి వద్ద తనిఖీల్లో నిర్మల్ జిల్లా ఖానాపూర్‌కు చెందిన వ్యాపారి కారులో తరలిస్తున్న రూ. 5.40 లక్షల నగదును పోలీసులు స్వాధీనం చేసుకొన్నారు. శేరిలింగంపల్లిలో ఓట్ల కోసం.. ఓ పార్టీ నాయకుడు మారబోయిన రఘునాథ్ యాదవ్ ప్రజలను మభ్యపెట్టడానికి ప్రెషర్ కుక్కర్స్ పంచడానికి ప్రయత్నం చేశాడు. గచ్చిబౌలి పోలీసులు దాడి చేసి కుక్కర్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదుచేశారు.


**వీడియో..**

రాష్ట్ర సరిహద్దు చెక్ పోస్టులలో సైతం పోలీసులు జల్లెడపడుతున్నారు. తల్లాడ సూపర్ మార్కెట్ యజమాని కొత్తూరి సైదకుమార్ కు చెందిన రూ.5 లక్షలను సీజ్ చేశారు. మధిర వద్ద తనిఖీల్లో కోనా గోపాలరావు అనే వ్యక్తి నుంచి రూ.12.65 లక్షలను సీజ్ చేశారు. పలుచోట్ల మద్యం, నగదు, నగలు పట్టుబడ్డాయి. మద్యం షాప్‌లు, నగల దుకాణాలు, హవాలా గ్యాంగ్‌లు, పెట్రోల్ బంక్‌లు, రేషన్ షాప్‌ల వద్ద పోలీసులు తనిఖీ చేస్తున్నారు.

అయితే ఇందులో ఏ ఒక్క లక్ష కూడా రాజకీయ నాయకుడికి చెందినది కాదు. పట్టుబడ్డ వీరంతా ఎదో ఒక ఉద్యోగంలో ఉన్నవారో, బిజినెస్ చేస్తున్న వారో ఉంటున్నారు. ముఖ్యంగా గోల్డ్ షాప్ నిర్వహకులే ఎక్కువగా పోలీసులకు పట్టుబడుతున్నారు. సీజ్ అవుతున్న గోల్డ్, నగదును పోలీసులు ఇన్‌కమ్ ట్యాక్స్ అధికారులకు అప్పజేపుతున్నారు. అయితే, ఈ నగదు, గోల్డ్ కు సంబంధించి వారు.. సంబధిత పత్రాలతో ఐటి అధికారులను సంప్రదించి తీసుకోవాల్సి ఉంటుంది. అన్ని పత్రాలు.. ఆధారాలను పరిగణలోకి తీసుకుని ఐటీ అధికారులు వారికి అందిస్తారు.

# బుల్లెట్ టూ బ్యాలెట్..

**-ప్రజాక్షేత్రంలోకి గాజర్ల అశోక్ అలియాస్ ఐతు**
**-కాంగ్రెస్ పార్టీలో చేరిక**



**టీ మీడియా, అక్టోబర్ 12,హైదరాబాద్ :** మావోయిస్ట్ ఉద్యమానికి ఊపిరులూదిన వెలిశాల గ్రామానికి చెందిన గాజర్ల అశోక్ అలియాస్ ఐతు ప్రజాక్షేత్రంలోకి అడుగిడుతున్నారు. తాడిత పీడిత ప్రజల కోసం 25 ఏళ్ల తన ఉద్యమ ప్రస్థానాన్ని వీడి రాజకీయాల్లోకి వచ్చారు. కుటుంబ వారసత్వంగా వచ్చిన ఉద్యమ నేపథ్యాన్ని బలం, బలగంగా మార్చుకుంటూ.. నేను సైతం అంటూ ప్రజాక్షేత్రంలోకి దిగాడు .ఐతు అలియాస్ గాజర్ల అ శ ో క ్ అప్పటి వరంగల్ ప్రస్తుత జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం వెలిశాల గ్రామం అంటేనే గుర్తుకు వచ్చేది 'గాజర్ల' కుంటుంబం. అప్పటి పీపుల్స్‌వార్.. ఇప్పటి మావోయిస్టు పార్టీకి అంకితమైన కుటుంబం అది. ఆ కుటుంబానికి చెందిన వారంతా అప్పటి పరిస్థితులలో దొరల పాలనకు.. పెత్తందారీ వ్యవస్థకు వ్యతిరేకంగా ఉద్యమించిన వారే. ప్రజలలో చైతన్యం తెచ్చి హక్కుల కోసం పోరాడిన యోధులే.వెలిశాల గ్రామానికి చెందిన గాజర్ల కనకమ్మ%--%మల్లయ్య దంపతులకు రాజయ్య, సమ్మయ్య, సారయ్య, రవి, అశోక్‌లు సంతానం. వారికున్న ఎనిమిదెకరాల భూమితోపాటు గీత వృత్తి ఆ కుటుంబానికి ఆధారం. పెద్ద కొడుకు రాజయ్య అనారోగ్యంతో మరణించగా.. రెండవ కొడుకు సమ్మయ్య సింగరేణిలో ఉద్యోగం చేసి రిటైరయ్యారు. అప్పటికే వారి తల్లిదండ్రులు కనకమ్మ%--%మల్లయ్యలు కన్నుమూయడంతో మిగతా వారు సారయ్య, రవి, అశోక్‌లు విప్లవపంథాను ఎంచుకుని పీడిత ప్రజల నాలుకలలో నానుతున్నారు. పెత్తందారి వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడడానికి 1989లో అప్పటి పీపుల్స్‌వార్‌లో చేరారు. అయితే అప్పుడు పోలీసుల నిర్భందం, వేధింపులు, అణచివేత మూలంగా 1992లో గాజర్ల రవి అలియాస్ గణేష్, 1994లో గాజర్ల అశోక్ అలియాస్ ఐతులు కూడా అన్నల బాట పట్టారు.

**మావోయిస్ట్ ఉద్యమంలో అమరులైన ఆజాద్, రమ**

పీపుల్స్‌వార్‌లో చేరిన గాజర్ల సారయ్య అలియాస్ భాస్కర్ పేరిట చిట్యాల దళ కమాండర్‌గా పని చేసి అంచలంచెలుగా ఎదిగి పీపుల్స్‌వార్ నుంచి మావోయిస్టు పార్టీగా మారిన పార్టీ సెంట్రల్ కమిటీ మెంబర్‌గా, మిలటరీ ప్లాటూన్ కమాండర్‌గా పనిచేసి ఏటూరునాగారం అటవీప్రాంతం కంతనపల్లి అడవుల్లో 2008 ఏప్రిల్ 2న జరిగిన ఎన్‌కౌంటర్‌లో తన సహచరి రమతోపాటు ఊపిరి వదిలారు. ఆ ఎన్‌కౌంటర్ ఇప్పటికీ సంచలనంగా మిగిలిపోగా న్యాయ విచారణ సైతం కొనసాగింది.

**ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో చర్చల ప్రతినిధిగా**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో 2004–05లో ప్రభుత్వంతో జరిగిన శాంతి చర్చలలో అప్పటి రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణతో కలిసి పార్టీ తరుపున ప్రతినిధిగా పాల్గొన్నారు గాజర్ల అశోక్ అలియాస్ గణేష్. అప్పటికే ఆయన ఆంధ్ర–ఒడిశా బార్డర్ కమిటీకి ప్రాతినిధ్యం వహిస్తుండడం గమనార్హం. అయితే అప్పటి ప్రభుత్వ విధానాలతో పార్టీకి పొసగకపోవడంతో తిరిగి మళ్లీ అజ్ఞాతంలోకి వెళ్లాడు. అయితే ప్రతిసారీ ఎక్కడ ఎన్‌కౌంటర్ జరిగినా గాజర్ల సోదరుల పేర్లు వినబడడం చిట్యాల ప్రాంత వాసులకు కంటి మీద కునుకు లేకుండా చేశాయి. మెరుపుదాడులు చేయడం, వ్యూహాత్మకంగా వ్యవహరించడంలో ముగ్గురు 'గాజర్ల' సోదరులు ఆరితేరిన వారుగా ఇప్పటికీ పార్టీలో, పోలీసు వర్గాలలో పేరుంది. కొద్దిరోజుల క్రితమే ఆరోగ్య కారణాలతో మావోయిస్టు పార్టీని వీడిన గాజర్ల అశోక్ కాంగ్రెస్ పార్టీలో చేరడం కీలకంగా మారింది. సరిగ్గా తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ విడుదల అయ్యాక చేరడం మరింత ప్రాధాన్యత సంతరించుకుంది.

-

**బీజేపీ, కాంగ్రెస్ బలమైన అభ్యర్థులు కరువు.**
**-ఈసారి లక్షకుపైగా మెజారిటి పక్కా అంటూ ధీమా**

**టీ మీడియా, అక్టోబర 12, రాజన్న సిరిసిల్ల:** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కే.టీ.రామారావు మరోసారి సిరిసిల్ల నియోజకవర్గం నుంచీ పోటీకి రెఢీ అయ్యారు. ఇక్కడి నుంచి వరుసగా విజయాలు సాధిస్తూ వస్తున్నారు.. అయితే ఈసారి.. లక్షకుపైగా మెజారిటీతో పక్కా అంటూ ధీమాతో ముందుకు వెళ్తున్నారు. అయితే కేటీఆర్‌ను ఢీకొట్టేందుకు సరియైన లీడర్ లేక ప్రతిపక్షాలు డీలాపడుతున్నాయి. ఇప్పటికీ.. ఏ పార్టీ కూడా తమ అభ్యర్థులను ప్రకటించలేదు. సిరిపిల్లపై ప్రత్యేక దృష్టి పెట్టిన బీఆర్ఎస్ మాత్రం.. ఈసారి ప్రతిపక్షాలకు డిపాజిట్ కూడా దక్కదంటోంది. ఇప్పటికే ఎన్నికల వ్యూహాలను రచిస్తున్నారు. ముఖ్య నేతలతో ఎప్పటికప్పుడు టెలికాన్ఫరెన్స్ నిర్వహిస్తున్నారు కేటీఆర్.సిరిసిల్ల నియోజకవర్గంలో ముఖ్యమంత్రి కేసీఆర్ కుమారుడు, మంత్రిగా ఉన్న కేటీఆర్ నాలుగుసార్లు ఘన విజయం సాదించారు. గత ఎన్నికల్లో ఆయన

# సిరిసిల్ల మళ్లీ కేటీఆర్ వెంటే..



భారీగా తన సమీప కాంగ్రెస్ ఐ ప్రత్యర్థి మహేందర్ రెడ్డిపై 89,009 ఓట్ల ఆదిక్యతతో గెలుపొందారు. అయినప్పటికీ మంత్రి పదవి దక్కలేదు కేటీఆర్‌కు. బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమితులయ్యారు. ఆ తర్వాత కొద్దికాలానికి కేసీఆర్ క్యాబినెట్‌లో మంత్రి అయ్యారు. తండ్రి కేసీఆర్ ఎనిమిది సార్లు శాసనసభకు ఎన్నికై రికార్డు సృష్టించగా, కేటీఆర్ ఐదోవసారి ఎమ్మెల్యేగా విజయం సాధించాలని ఉవ్విళ్ళురుతున్నారు.

రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రం సిరిసిల్ల మంచీ బీఆర్ఎస్ అభ్యర్థిగా బరిలోకి దిగుతున్నారు ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటిఆర్. ఇప్పటి వరకు ఒక లెక్క.. ఈసారి ఒక లెక్క అన్నట్లు ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా సుడిగాలి పర్యటన చేస్తూనే.. సిరిసిల్లపై ప్రత్యేక దృష్టి పెట్టారు. ఈ క్రమంలోనే నియోజకవర్గాన్ని వేగంగా అభివృద్ధి చేశారు. ఎంత బిజీ ఉన్నా వారంలో ఒక్కసారి, ఖచ్చితంగా నియోజకవర్గంలో పర్యటించే విధంగా ప్లాన్ చేసుకున్నారు కేటీఆర్. ఎన్నికలు ఎప్పుడు వచ్చిసా సిద్ధమే అన్నట్లు.. పెండింగ్ పనులు పూర్తి చేసుకున్నారు.

2018 ఎన్నికల్లో 89 వేలకు పైగా మెజారిటీతో విజయం సాధించారు. అయితే.. ఈసారి లక్షకు పైగా మెజారిటీ సాధిస్తామనే ధీమాతో ఉన్నారు కేటీఆర్. అయితే.. 2019 పార్లమెంట్ ఎన్నికల్లో మాత్రం.. భారతీయ జనతాపార్టీ బలపడింది. బీఆర్ఎస్‌కు గట్టి పోటీ ఇచ్చింది. ఈ నియోజకవర్గంలో కేవలం రెండు వేలకు పైగా మెజారిటీని సాధించింది బీఆర్ఎస్. గత ఎన్నికలతో పోలిస్తే బీజే బలం బాగా పుంజుకుంది. కొడితే కుంభస్థలాన్నే కొట్టాలనుకుంటోంది కాషాయపార్టీ. అందుకే కీలక నేత ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలో వ్యూహం మార్చింది. అక్కడి గెలుపోటములను ప్రభావితం చేసే వర్గంపై గురిపెట్టింది. చేనేత సామాజికవర్గ నేతను బరిలోకి దించాలనుకుంటోంది. అయినప్పటికీ కేటీఆర్ ప్రచారంలో దూసుకుపోతున్నారు.

ఇక కాంగ్రెస్ విషయానికి వస్తే మాత్రం అంతంత మాత్రమే. మరోవైపు ఇప్పటివరకు ప్రతిపక్షాలు తమ అభ్యర్థుల పేర్లను ప్రకటించలేదు.. కాంగ్రెస్ నుంచీ కేకే మహేందర్ రెడ్డి పోటీ చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. అయితే.. ఈయన నియోజకవర్గానికి తక్కువ సమయం కేటాయిస్తున్నారని ఆ పార్టీ నేతలు గుసగుసలాడుకుంటున్నారు. ఇదే కాంగ్రెస్ శ్రేణుల్లోనే అసంతృప్తి ఉంది. బీజేపీకి కూడా బలమైన అభ్యర్థి లేరు.. పద్మశాలి వర్గానికి చెందిన లగిశెట్టి శ్రీనివాస్‌ను రంగంలోకి దింపేందుకు ప్లాన్ చేస్తోంది. కానీ ఈ నియోజకవర్గంలో, ఏ మాత్రం ప్రభావం చూపుతారనే అనుమానాలు ఉన్నాయి. అసెంబ్లీ ఎన్నికలకు సమయం దగ్గర పడుతుండటంతో ప్రతిపక్ష పార్టీలు అనుకున్న స్థాయిలో పుంజుకోకపోవడం.. కేటీఆర్‌కు ప్లస్ పాయింట్ మారింది..

గత నియోజకవర్గాలతో పోలిస్తే సిరిసిల్ల వేగంగా అభివృద్ధి చెందింది. అయితే సెకండ్ క్యాడర్ లీడర్ల వ్యవహారం కాస్తా ఇబ్బందిగా మారింది. సెకండ్ క్యాడర్ లీడర్స్ కారణంగా కార్యకర్తలకు.. కేటీఆర్‌కు మధ్య గ్యాప్ ఏర్పడింది. ఇది కేటీఆర్‌కు మైనస్. ఇదిలావుంటే సిరిసిల్ల నియోజకవర్గంపై బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ ఫోకస్ పెట్టారు. ఖచ్చితంగా కేటీఆర్‌కు చెక్ పెడతామంటున్నారు. ఇక మారిన రాజకీయ పరిణామాలతో సిరిసిల్ల కేటీఆర్‌కు కలిసొచ్చేలా కనిపిస్తోంది. ఇక్కడ ప్రతిపక్షాలకు కనీసం డిపాజిట్లు కూడా రావని ధీమా వ్యక్తం చేస్తున్నారు బీఆర్ఎస్ నేతలు. మొత్తానికి.. సిరిసిల్లలో ఆసక్తికరమైన పోరు కనపడుతుంది.



## పాకిస్థాన్ మ్యాచ్.. ప్రత్యేక రైళ్లు

**-భారత్- పాకిస్థాన్ మ్యాచ్.. ప్రత్యేక రైళ్లు**

**టీ మీడియా, అక్టోబర్ 12,ముంబయి:** వన్డే ప్రపంచకప్‌లో భాగంగా శనివారం భారత్–పాకిస్థాన్ మ్యాచ్ జరగనుంది. అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోడీ స్టేడియంలో ఈ చిరకాల ప్రత్యర్థుల మధ్య మ్యాచ్ జరగనుంది. ఈ మ్యాచ్ కోసం ముంబై నుంచి అహ్మదాబాద్‌కు ఓ వందే భారత్ సహా రెండు ప్రత్యేక రైళ్లు నడిపేందుకు పశ్చిమ రైల్వే సిద్ధమవుతోంది. శుక్రవారం రాత్రి 9:30 గంటలకు ముంబై నుంచి ఈ ప్రత్యేక రైళ్లు బయల్దేరనున్నాయి.. తర్వాతి రోజు ఉదయం 5.30 గంటలకు అహ్మదాబాద్ చేరుకోనుంది. అలాగే మ్యాచ్ తర్వాతి రోజు ఉదయం 4 గంటలకు అహ్మదాబాద్ నుంచి బయల్దేరే రైలు మధ్యాహ్నం ముంబయికి చేరుకోనుంది ప్రపంచకప్‌లో భారత్–పాకిస్థాన్ మ్యాచ్ కోసం బీసీసీఐ ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోంది. ఆరంభ వేడుకలు లేకుండానే ఈ ప్రపంచకప్ మొదలైంది. ఈ నేపథ్యంలో భారత్– పాక్ పోరుకు ముందు నరేంద్ర మోదీ స్టేడియంలో ప్రత్యేక కార్యక్రమాన్ని బీసీసీఐ నిర్వహించనుందని సమాచారం. ఈ కార్యక్రమానికి సచిన్ తెందుల్కర్, అమితాబ్ బచ్చన్, రజనీకాంత్‌ను బీసీసీఐ ఆహ్వానించినట్లు తెలిసింది. అలాగే కేంద్ర హెూం మంత్రి అమిత్ షా కూడా హాజరవుతారని అంటున్నారు. ఘనంగా నిర్వహించే ఈ కార్యక్రమంలో బాలీవుడ్ గాయకుడు అర్జిత్ సింగ్ ప్రదర్శన ఉండబోతుంది.

## 119 నియోజకవర్గాల్లో...
# వైఎస్సార్‌టీపి పోటీ

**-పాలేరు నుంచి షర్మిల**



టి మీడియా, అక్టోబర్ 12 ,హైదరాబాద్: తెలంగాణ వ్యాప్తంగా 119 నియోజకవర్గాల్లో పోటీ చేయాలని వైఎస్ఆర్ తెలంగాణ పార్టీ నిర్ణయించింది. ఈ మేరకు పార్టీ రాష్ట్రస్థాయి కార్యవర్గ సమావేశంలో ఆ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల నిర్ణయించారు. పాలేరు నియోజక వర్గం నుంచి షర్మిల బరిలోకి దిగనున్నారు. పార్టీ బీఫామ్‌ల కోసం దరఖాస్తు చేసుకోవాలని నేతలకు షర్మిల సూచించారు. " పాలేరుతోపాటు మరోచోట పోటీ చేయాలనే డిమాండ్ ఉంది. అనిల్, విజయమ్మను కూడా పోటీ చేయించాలని డిమాండ్ ఉంది. అవసరమైతే వారిద్దరూ పోటీ చేస్తారు. కాంగ్రెస్‌తో కలిసి వెళ్తే ప్రజా వ్యతిరేక ఓటు చీలదు అనుకున్నాం. ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలిస్తే కేసీఅర్ మళ్ళీ ముఖ్యమంత్రి అవుతారేమో అనుకున్నాం. అందుకే కాంగ్రెస్‌తో చర్చలు జరిపాం. 4 నెలలు ఎదురు చూశాం. రాష్ట్రంలో మళ్ళీ వైఎస్సార్ సంక్షేమ పాలన తీసుకువస్తాం" అని షర్మిల తెలిపారు.

## అత్తను తుపాకీతో..
# కాల్చి చంపిన అల్లుడు

మిగతా 2లో...

# అత్తను తుపాకీతో..
# కాల్చి చంపిన అల్లుడు



**టీ మీడియా, అక్టోబర్ 12, హన్మకొండ :** సొంత అత్తను గన్ తో కానిస్టేబుల్ కాల్చి చంపిన ఘటన కలకలం రేపింది. ఈ ఘటన హన్మకొండలో సంచలనంగా మారింది. నిందితుడిని కానిస్టేబుల్ ప్రసాద్ గా గుర్తించారు. మంచిర్యాలకు చెందిన ప్రసాద్ రామగుండం కమిషనరేట్ పరిధిలోని కొత్తకోట పోలీస్ స్టేషన్ లో కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తున్నాడు. మృతురాలిని కమలమ్మగా గుర్తించారు. కానిస్టేబుల్ పై మృతురాలి కుటుంబ సభ్యులు దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో ఆయనను హుటాహుటిన వరంగల్ ఎంజీఎంకు తరలించారు. కాగా కానిస్టేబుల్ పరిస్థితి సీరియస్ గా ఉన్నట్లు తెలిసింది. రూ.4లక్షల విషయంలో అత్త అల్లుడి మధ్య కొన్ని రోజులుగా వివాదం కొనసాగుతున్నట్లు తెలిసింది. దీంతో గురువారం ఉదయం మంచిర్యాల నుంచి భార్యతో కలిసి గుండ్ల సింగారంకు వచ్చిన ప్రసాద్.. అత్తతో మాట్లాడుతున్న క్రమంలో గన్ తో ఛాతిలో కాల్పులు జరిపాడు. దీంతో కమలమ్మ అక్కడికక్కడే మృతిచెందింది. కాల్పులు జరిపి అక్కడే నిలబడిన కానిస్టేబుల్ పై మృతురాలి కుటుంబ సభ్యులు రాళ్లతో దాడి చేశారు. దీంతో తలకు తీవ్రంగా గాయాలయ్యాయి.

## కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడితే
# సంక్షేమ పథకాలు అందుతాయి

### - ఎమ్మెల్యే దుద్దిళ్ళ శ్రీధర్ బాబు

**టీ మీడియా, అక్టోబర్ 12, ముత్తారం :** ముత్తారం మండల కేంద్రంలోని కాసర్ల గడ్డ బస్టాండ్లో గురువారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించిన అనంతరం ముత్తారం మండల కేంద్రం నుంచి మచ్చుపేట గ్రామపంచాయతీ వరకు ర్యాలీగా వెళ్లి కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన 6 గ్యారంటీ పథకాల గ్యారంటీ కార్డుల పంపిణీ చేసిన అనంతరం మాట్లాడుతూ మహిళా ఆడపడుచులకు రైతులకు అండగా ఉంటా ఆశీర్వదించి గెలిపించండి. మీ అన్నగా మీ కొడుకుగా మీ తమ్ముడిగా పని చేస్తా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే మహిళలకు కళ్యాణ లక్ష్మీ తో పాటు తులం బంగారం ఇస్తాం ప్రతినెల మహిళలకు 2500 రూపాయలు ఇస్తాం గతంలో ఇచ్చినట్లుగా రేషన్ షాపులో తొమ్మిది రకాల సరుకులు అందచేస్తాం. తెలంగాణ రాష్ట్రంలోని మహిళలు బెల్ట్ షాపులు వద్దంటే మ్యానిఫెస్టోలో పెట్టుతా మహిళల పేరు మీద ఇల్లు లేని ప్రతి నిరుపేదకు ఇంటి జాగా ఐదు లక్షల రూపాయల తో ఇల్లు నిర్మిస్తాం చదువుకునే యువతకు తెలంగాణలోని ప్రతి మండలానికి పట్టణాలలో ఏ విధమైన చదువు సంస్కారం ఉంటదో అదే విధంగా మారుమూల ప్రాంతాలకు సంబంధించిన గ్రామాలకు కూడా కార్పొరేట్ విద్యను అందించే విధంగా పనిచేస్తాం. పదవ తరగతి తర్వాత ఐదు లక్షల రూపాయలతో యువతకు ఏటీఎం కార్డు తరహాలో ఇచ్చి యువతను ముందంజలో ఉంచుతాం రైతులకు అండగా ఉండి తరుగు పేరుతో మోసం చేయకుండా పనిచేస్తాం గృహ ఉపయోగాల కోసం వాడుకునే కరెంటు 200 యూనిట్ల లోపు కాల్చుకుంటే ఫ్రీగా కరెంటు ఇస్తామన్నారు. ముత్తారంలో జూనియర్ కాలేజీకి స్థలం సెంటనరీ కాలనీలో పాలిటెక్నిక్ కాలేజ్ ఏర్పాటుచేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదే అన్నారు. రైతులకు సంబంధించి రైతు భరోసా కార్డు ఇస్తామన్నారు. బిఆర్ ఎస్ ప్రభుత్వంలో త రుగు పేరుతో ఎకరాకు రైతుల దగ్గర 15 వేల రూపాయలు దోచుకొని రైతు బంధు పేరుతో రైతులకు ఐదు వేల రూపాయలు ఇచ్చిన ఘనత టిఆర్ఎస్ ప్రభుత్వానిదే అన్నారు. తరుగు పేరుతో 15 వేల రూపాయలు దోచుకొని రైతులకు ఐదు వేల రూపాయలు ఇచ్చిన ఘనత టిఆర్ఎస్ ప్రభుత్వానిదే కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే ఎకరాకు 15 వేల రూపాయల రైతుబంధు ఇస్తామన్నారు. కౌలు రైతులకు కూడా 15వేల రూపాయలు ఇచ్చి కాంగ్రెస్ ఇచ్చిన హామీ నిలబెట్టుకుంటామన్నారు. భూమిలేని నిరుపేదలకు సంవత్సరానికి 12,000 ఇచ్చి ఆదుకుంటామన్నారు పరిశ్రమలు తీసుకువచ్చి గ్రామీణ ప్రాంత యువకులకు ఉద్యోగ కల్పన చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు చొప్పరి సదానందం మండల పార్టీ అధ్యక్షులు దొడ్డ బాలాజీ ముత్తారం సర్పంచ్ తుటి రజిత రఫీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు మద్దెల రాజయ్య,యువజన కాంగ్రెస్ అధ్యక్షులు బియ్యాని శివ కుమార్ కిసాన్ సెల్ అధ్యక్షులు గాదం,శ్రీనివాస్ మైనార్టీ సెల్ అధ్యక్షులు వాజిద్ పాషా మండల ప్రధాన కార్యదర్శి అనుము గోపి సోషల్ మీడియా ఇన్చార్జి కోల,విజయ చేలకల జితేందర్ ఆకోజు అశోక్ విష్ణు గౌడ్ దాసరి చంద్రమౌళి గౌడ్ అధిక సంఖ్యలో కాంగ్రెస్ కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.





## భర్తను దారుణంగా హత్య చేసిన భార్య

**టీ మీడియా, అక్టోబర్ 12, గోదావరిఖని :** పెద్దపల్లి జిల్లాలో దారుణం చోటు చేసుకుంది ఓ మహిళ తన భర్తను అతి దారుణంగా హత్య చేసింది అనంతరం మృతుని తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు ఇటీవల చోటు చేసుకున్న ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలకలంగా మారుతోంది ఇంతకు ఆ మహిళ తన భర్తను ఎందుకు హత్య చేసింది.ఈ ఘటనలో అసలేం జరిగిందంటే.పోలీసుల కథనం ప్రకారం పెద్దపల్లి జిల్లా గోదావరిఖని పరిధిలోని మార్కేండయ కాలనీలో కొచ్చర్ల ప్రవీణ్ (42) లలిత దంపతులు నివాసం ఉంటున్నారు. వీరికి ముగ్గురు పిల్లల సంతానం ప్రవీణ్ స్థానిక ప్రాంతాల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తూ బాగానే సంపాదించాడు అయితే ఈ క్రమంలోనే మొగుడు పరాయి మహిళతో వివాహేతర సంబంధాన్ని కొనసాగిస్తున్నాడని తరుచు భర్తతో గొడవకు దిగేది ఇంతే కాకుండా ఆస్తి వ్యవహారాల గురించి ఏం చెప్పేవాడు కాదని కోపం పెంచుకుంది ఇక లలిత ఎలాగైన భర్తను చంపాలని అనుకుంది.ఇందులో భాగంగానే మొగుడి వద్ద పని చేసే ఓ వ్యక్తి సాయం కోరింది. దీనికి అతడు కూడా సరే అన్నాడు ప్లాన్ ప్రకారమే ఈ నెల 10న భర్త ప్రవీణ్ అర్ధరాత్రి ఇంట్లో నిద్రపోయి ఉన్నాడు ఇదే సమయంలో అతడిని ఇంటికి పిలిచి ప్రవీణ్ ముఖంపై దిండు పెట్టి ఊపిరాడకుండా చేసి హత్య చేసింది ఆ తర్వాత నిందితులు అక్కడి నుంచి పరారయ్యారు. అనంతరం ఈ విషయం తెలుసుకుని మృతుని తల్లి గుండెలు పగిలేలా ఏడ్చింది ఇక ఈ ఘటనపై స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. తాజాగా చోటు చేసుకున్న ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలంగా మారింది.



## జాతీయ బాలిక దినోత్సవం

టీ మీడియా,అక్టోబర్ 12, కోరుట్ల : కోరుట్ల పట్టణం లోని జడ్పిహెచ్ఎస్,హైస్కూల్ లో గురువారం జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా తొమ్మిదవ తరగతి, పదవ తరగతి,బాలికలకు ఉన్నత విద్యా,లింగ బేధం, బాల్యవివాహాలు,వాటి పై విద్యార్థినిలకు అవగాహన, ప్రతిజ్ఞ చేయించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిడిపిఓ తిరుమల దేవి, సూపర్వైజర్ ప్రేమలత,షైనీ పాల్గొన్నారు.



# ఎన్నికల బహిష్కరిస్తున్నాం..

## ఊర్లకు ఊర్లే నిర్ణయంలు

### -ప్రభుత్వాలు మారుతున్నా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే

**టి మీడియా, అక్టోబర్ 12,ఉమ్మడి ఆదిలాబాద్ :** ప్రభుత్వాలు మారుతున్నాయి.. పాలకులు మారారు.. అయినా తమ సమస్య తీరడం లేదు.. దశాబ్దాలు గడుస్తున్నా.. ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా గ్రామాల బతుకులు ఆగిపోయాయి. నడక దారి లేక వాగులపై ప్రమాదకర ప్రయాణాలు చేస్తూ నరకం అనుభవిస్తున్నారు.. ఇక ఇలాగైతే కుదరదు సర్కార్‌తో తాడో పేడో తేల్చుకోవాల్సిందే అంటూ కఠిన నిర్ణయం తీసుకున్నాయి ఆ గ్రామాలు. రాబోయే ఎన్నికలను బహిష్కరిస్తున్నట్టు తేల్చి చెప్పేశారు.ఈ ఎన్నికల్లో ఏ నాయకుడు తమ గ్రామానికి ఓటు అడిగేందుకు అడుగు పెట్టవద్దని హెచ్చరిస్తున్నారు. తమ సమస్యలు తీర్చే సత్తా ఉంటే.. వాగులపై వంతెనలు నిర్మించే దమ్ముంటేనే తమ గ్రామానికి రావాలంటూ హుకుం జారీ చేస్తున్నారు. రాబోయే ఎన్నికలను బహిష్కరిస్తున్నామని.. ఓట్ల కోసం మా గ్రామాల వైపు రావద్దంటూ నాయకులకు వార్నింగ్‌లు ఇస్తున్నారు అక్కడి ప్రజలు. ఉమ్మడి ఆదిలాబాద్‌లో ఇప్పుడు ఏ మారుమూల గ్రామం వెళ్లినా ఎన్నికల బహిష్కరణ నినాదాలే వినిపిస్తున్నాయి. గో బ్యాక్ లీడర్స్ అన్న ఫ్లెక్సీలే దర్శనం ఇస్తున్నాయి.ఉమ్మడి ఆదిలాబాద్ లోని గుండి, గంగాపూర్ గ్రామపంచాయితీల పరిధిలోని 18 గ్రామాలు మూకుమ్మడిగా అసెంబ్లీ ఎన్నికలను బహిష్కరిస్తూ నిర్ణయం తీసుకున్నాయి. కారణం ఒకటే ఆయా గ్రామాలకు రాకపోకలు సాగించేందుకు కనీసం రహదారి లేకపోవడం. వాగులపై వంతెనలు నిర్మాణం పూర్తికాకపోవడంతో దశాబ్దాలుగా తెప్పలపై నాటు పడవలపై ప్రమాదకరంగా ప్రయాణాలు సాగించలేక.. న్యాయం కోసం దశాబ్దాలుగా పోరాటాలు చేసిన ఫలితం రాకపోవడంతో మూకుమ్మడిగా ఓ తీర్మానం చేశారు. ఇక చేసేది లేక రాబోయే అసెంబ్లీ ఎన్నికలను బహిష్కరిస్తున్నట్టుగా ప్రకటించారు.

నిర్మల్ జిల్లా కడెం మండలం గంగపూర్ గ్రామ పంచాయితీలో 12 గ్రామాలున్నాయి. ఈ 12 గ్రామాలు మండల కేంద్రానికి చేరాలంటే కడెం వాగును దాటాల్సిందే. ఈ వాగుపై వంతెన నిర్మాణానికి గతంలోనే టెండర్లు ఖరారైన వంతెన నిర్మాణం ప్రారంభమైన బడ్జెట్ కొరతతో నిర్మాణ పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. దీంతో రాకపోకల కష్టాలు తీరుతాయనుకున్న గంగాపూర్ గ్రామపంచాయతీ వాసులకు వంతెన నిర్మాణం పూర్తి కాకపోవడంతో మళ్లీ అదే కష్టాలు వెంటాడాయి. తాజాగా కడెం వరదలతో కడెం వాగు ఉప్పెనలా మారగా ఆ వాగు దాటలేక మూడు నెలలు ఇండ్లకే పరిమితమై నరకయాతన అనుభవించారు. దీంతో ఈసారి జరగబోయే ఎన్నికల్లో తమ ఓటు హక్కు వినియోగించుకునేదే లేదంటూ కంకణం కట్టుకున్నారు. తమ గ్రామానికి వాగుపై వంతెన నిర్మాణం పూర్తయ్యాకే తమ ఓటు హక్కును వినియోగించు కుంటామంటూ తేల్చి చెప్పారు. తమ గ్రామంలోకి ఓట్లు అడిగేందుకు ఏ పార్టీ నాయకుడు కూడా రావద్దంటూ హెచ్చరికలు జారీ చేశారు. ఒక్క నిర్మల్ జిల్లాలోని గంగాపూర్ గ్రామపంచాయతీ లోని 12 గ్రామాల పరిస్థితి మాత్రమే కాదు అటు కొమరం భీం జిల్లాలోని గుండీ గ్రామస్తులవి అవే కష్టాలు.

కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రానికి కేవలం 5 కిలోమీటర్ల దూరంలో ఉన్నా గుండి గ్రామస్తులకు దశాబ్దాలుగా రోడ్డు మార్గం లేదు. కారణం అక్కడ ప్రవహిస్తున్న గుండి వాగే కారణం. ఈ వాగు పై దశాబ్దం క్రితమే వంతెన నిర్మాణానికి అనుమతి వచ్చినా.. అక్కడి పాలకుల నిర్లక్ష్యంతో ఇప్పటి వరకు ఆ వంతెన పూర్తి కాలేదు. వంతెన నిర్మాణం మధ్యలోనే ఆగిపోవడంతో వరద కష్టాల నుండి గట్టెక్కలేక.. వరదలో వాగు దాటలేక పదేళ్లుగా నరకం చూస్తునే ఉన్నారు గుండి వాసులు. దీంతో ఈసారి జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకోకూడదని.. ఎన్నికలను బహిష్కరించాలని ఓ నిర్ణయానికి వచ్చారు.అటు కొమురంభీం జిల్లా గుండిలోని ఆరు గ్రామాల ప్రజలు ఇటు నిర్మల్ జిల్లాలోని గంగాపూర్ పంచాయితీలోని 12 గ్రామాల ప్రజలు ఎన్నికల బహిష్కరణ నిర్ణయంతో ఓటు హక్కుకు దూరం కాబోతున్నారు. గ్రామ పెద్దల నిర్ణయంతో ఇప్పుడు ఆయా గ్రామాలలో ఎక్కడ చూసిన పోల్ బాయ్‌కాట్ నినదాలే వినిపిస్తున్నాయి. ఇక్కడి ప్రజల డిమాండ్ కారణంగా ఈ గ్రామాల్లో ప్రచారం చేపట్టేందుకు అధికార బీఆర్ఎస్ నాయకులు జంకుతున్నారు. ఈ 18 గ్రామాల ప్రజల నిర్ణయంతో బీఆర్ఎస్ నేతల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. తాజాగా గ్రామస్తులంతా గ్రామాల్లోని ప్రభుత్వ కార్యాలయాలకు తాళాలు వేసి మూకుమ్మడిగా నిరసన చేపట్టారు. గ్రామ పంచాయతీ కార్యాలయం, అటవీ శాఖ కార్యాలయాలకు తాళాలు వేసి వాగుఒడ్డు వద్ద ఆందోళనకు దిగారు.తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత అయినా తమ గ్రామానికి రోడ్డు సౌకర్యం, వాగుపై వంతెన నిర్మాణం జరుగుతుందని ఆశించినా నిరాశే మిగిలింది. ఇక్కడి నాయకులను నమ్మి గెలిపించుకున్నామని.. అయినా ఆ నేతలు ఎన్నికలు ముగిసాక తమ గ్రామాల వైపు కన్నెత్తి చూడలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు గ్రామస్తులు. కొమురంభీం జిల్లా గుండి గ్రామస్తులతో పాటు నిర్మల్ జిల్లా కడెం మండలం గంగాపూర్ పంచాయతీతో పాటు కొత్తగా ఏర్పాటైన రాణిగూడ, కొర్రతాండ పంచాయతీలకు అనుబంధంగా ఉన్న మరో తొమ్మిది గ్రామాలు సైతం ఎన్నికల బహిష్కరణ నిర్ణయానికి వచ్చారు.



## అభివృద్ధి, సంక్షేమమే ఎజెండా ఎమ్మెల్యే సైదిరెడ్డి

**టి మీడియా, అక్టోబర్ 12, హుజూర్ నగర్ :** అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం హుజుర్ నగర్ నియోజకవర్గ పరిధిలోని హుజుర్ నగర్, నేరేడుచెర్ల మున్సిపాలిటీ లలో పట్టణ బీఆర్ఎస్ పార్టీ బూత్ కమిటీల సమావేశం నిర్వహించడం జరిగింది. హుజుర్ నగర్ పట్టణ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు అమర్ నాథ్ రెడ్డి ఆధ్వర్యంలో వారి అధ్యక్షత న జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హుజుర్ నగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి పాల్గొని, కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రసంగించారు హుజూర్ నగర్ మున్సిపాలిటీ పరిధిలోని 32 బూతులకు పట్టణ బీఆర్ఎస్ పార్టీ బూత్ కమిటీ సమావేశాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా బూత్ కమిటీ సభ్యులు ప్రతి ఒక్కరికి 100 ఓట్ల బాధ్యతలు అప్పజెప్పడం జరుగుతుందని నాయకులకు కార్యకర్తలకు, బూత్ కమిటీ సభ్యులకు వారు చేయాల్సిన విధానం తెలిపి వారి బాధ్యతలు అప్పజెప్పి దిశా నిర్దేశం చేయడం జరిగింది. బూత్ కమిటీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలతో కలసి సమావేశం ఏర్పాటు చేసి ఎన్నికల ప్రచారం, కార్యచరణలో భాగంగా అన్ని విషయాలు మాట్లాడి, డోర్ టు డోర్ ప్రచారం చేయవలసిందిగా అదేశించారు.

**బతుకమ్మ సంబరాలలో పాల్గొన్న ఎమ్మెల్యే సైదిరెడ్డి :**
గురువారం హుజుర్ నగర్ పట్టణంలో జరిగిన ఎంగిలి పూల బతుకమ్మ సంబరాలలో పాల్గొని మహిళలతో కలిసి, బతుకమ్మ ఆడారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి మాట్లాడుతూ.. నియోజకవర్గం తో పాటు రాష్ట్రం లో గత తొమ్మిదేళ్లుగా కొనసాగుతున్న అభివృద్ధికి ఇతర పార్టీల నుంచి ఆగకుండా వలసలు కొనసాగుతున్నాయన్నారు. సీఎం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను చూసి భారాస పార్టీలో చేరడం జరిగిందని, కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని, గ్రామాల్లో గతంలో అడుగంటిన చెరువులన్నీ ప్రస్తుతం జల కళను సంతరించుకున్నాయని, ఈ నెల 31 నా జరిగే కేసిఆర్ బహిరంగ సభకు జనం సమీకరణను ఇప్పటి నుంచే మొదలు పెట్టాలని, కోరారు.ఈ కార్యక్రమంలో హుజూర్ నగర్, నేరేడు చెర్ల బిఆర్ ఎస్ నాయకులు, వార్డు అధ్యక్షులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## న్యాయవాద దంపతుల హత్య కేసు.
### -మరో ఇద్దరికి బెయిలు మంజూరు



**టి మీడియా, అక్టోబర్ 12, పెద్దపల్లిబ్యూరో** :న్యాయవాద దంపతులు గట్టు వామన్ రావు-పీవీ నాగమణిల హత్య కేసులో ఏ-1, ఏ -2 నిందితులకు బెయిలు మంజూరు అయింది. ఈ మేరకు గురువారం పెద్దపల్లి జిల్లా కోర్టులో నిందితుల తరఫు న్యాయవాది బెయిల్ పిటిషన్ దాఖలు చేయగా వాదనలు విన్న కోర్టు బెయిల్ మంజూరు చేస్తూ ఆదేశాలు జారీ చేసింది. ష్యూరిటీస్ సబ్మిట్ చేసిన అనంతరం ఇద్దరు నిందితులు కూడా జైలు నుంచి బయటకు రానున్నారు. ఈ కేసులో ఏ1గా కుంట శ్రీనివాస్, ఏ2గా అక్కపాక కుమార్‌కు బెయిల్ మంజూరు అయింది. కాగా, 2021 ఫిబ్రవరి 17న పెద్దపల్లి, మంథని రహదారిలోని కల్వచర్ల సమీపంలో కారులో ప్రయాణిస్తున్న గట్టు వామన్ రావు, పీవీ నాగమణి దంపతులు హత్యకు గురైన సంగతి తెలిసిందే. రాష్ట్ర వ్యాప్తంగా సంచలనంగా మారిన ఈ కేసులో అరెస్ట్ అయిన నిందితులు ఒక్కొక్కరికి వివిధ కోర్టులు బెయిల్ మంజూరు చేశాయి. తాజాగా జైలు జీవితం గడుపుతున్న మరో ఇద్దరికి కూడా బెయిలు వచ్చింది.

## కోదండ రామాలయ అర్చకుడు ఆత్మహత్యాయత్నం

**టీ మీడియా, అక్టోబర్ 12, రామకృష్ణాపూర్ :** క్యాతనపల్లి మునిసిపాలిటీ రామకృష్ణాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని శ్రీ కోదండ రామాలయం ప్రధాన అర్చకుడు పానిపట్ల చక్రవర్తి (37) తండ్రి అంబా ప్రసాద్ శర్మ గురువారం రామకృష్ణాపూర్ ఏఎన్ఎం వెంకటలక్ష్మి, అర్చకుడు చక్రవర్తి భార్య శాలిని ఒక ఉంగరం విషయంలో జరిగిన గొడవను దృష్టిలో పెట్టుకుని అదే కాలనీకి చెందిన ఉదయం రిపోర్టర్ జోసెఫ్ అలియాస్ సంతోష్ అనే వ్యక్తి ఏఎన్ఎం వెంకటలక్ష్మికి సపోర్ట్ చేస్తూ నీపై పోలీసు కేసు పెట్టిస్తాను అని బెదిరిస్తూ,రెండు లక్షల రూపాయలు ఇవ్వమని అడిగి ఇవ్వకపోతే అర్చకత్వం చేస్తున్న చక్రవర్తి పై దేవాలయ సంబంధిత కేసులు మోపుతానని బెదిరించడంతో అర్చకుడు చక్రవర్తి మనస్థాపానికి గురై గుర్తుతెలియని (30) మాత్రలు మింగి ఆత్మహత్యా ప్రయత్నం చేయబోయాడు.వెంటనే గమనించిన అతని భార్య శాలిని అతనిని మెరుగైన వైద్యం కోసం మంచిర్యాల దావకానకు తరలించడం జరిగింది.తన భర్త చక్రవర్తి ఆత్మహత్యా ప్రయాత్నాకి కారణమైన ఉదయం రిపోర్టర్ జోసెఫ్ అలియాస్ సంతోష్ పై చట్టరీత్య చర్య తీసుకోగలరని గురువారం ఉదయం చక్రవర్తి భార్య ఇచ్చిన దరఖాస్తు మేరకు ఎస్సై జి.రాజశేఖర్ కేసు నమోదు చేయడం జరిగింది.



## వేదవ్యాస పాఠశాలలో ఘనంగా ముందస్తు బతుకమ్మ సంబరాలు

**టీ మీడియా, అక్టోబర్ 12, పెద్దపల్లి బ్యూరో :** పెద్దపల్లి జిల్లా కాల్వ శ్రీరాంపూర్ పాఠశాలలకు మొదటి టర్మ్ సెలవు ఇస్తున్న సందర్భంగా బతుకమ్మ పండుగను పురస్కరించుకొని మండల కేంద్రంలోని వేద వ్యాస హై స్కూల్ లో ముందస్తు బతుకమ్మ సంబరాలు అంబరాన్ని అంటే లా జరుపుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముందుగా బతుకమ్మ ప్రాశస్త్యం సాంప్రదాయాల గురించి మరియు వాటిని కాపాడుకునే మనందరి బాధ్యతల గురించి పాఠశాల కరస్పాండెంట్ జూపాక ఉమామహేశ్వర్ విద్యార్థులను ఉద్దేశించి వివరించారు. అనంతరం విద్యార్థినిలు రంగురంగుల పూలతో ముందుగానే అలంకరించుకున్న బతుకమ్మలతో సాంప్రదాయ బతుకమ్మ పాటల్ని పాడుతూ చప్పట్లు కొడుతూ తెలంగాణ సాంప్రదాయ ముట్టిపడేలా సంప్రదాయ దుస్తులతో రంగుల రంగవల్లుల మధ్య బతుకమ్మ పండుగను నిర్వహించుకున్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ గుర్రం దివాకర్ ప్రిన్సిపల్ కోట సదయ్య, లావణ్య, శ్రీకాంత్ ,రహీం పాషా,రమ్యశ్రీ శ్వేత స్వాతి,జమున, దీప్తి, నిహారిక , అశోక్ ,రాములు, బద్రి స్వరూప, రాజలింగు,దేవామణి తో పాటు పాఠశాల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు


## ప్రపంచ ఆవిష్కరణలకు కేంద్రంగా భారత్ - ప్రధాని మోడి



**టీ మీడియా, అక్టోబర్ 12, న్యూఢిల్లీ :** దేశ ప్రజల శక్తి, నైపుణ్యాల కారణంగానే ప్రపంచ ఆర్థికాభివద్ధిలో భారత్ మెరుగైన స్థానానికి చేరుకుంటోందని ప్రధాని మోడి అన్నారు. అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ 'వరల్డ్ ఎకనామిక్ అవుట్‌లుక్' పేరుతో 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వివిధ దేశాల వద్ధి రేటు అంచనాలను విడుదల చేసింది. భారత్ వద్ధి రేటు అంచనా 6.3 శాతంగా ఉంటుందని అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ పేర్కొంది. ఇటీవల భారత్ వద్ధి రేటును రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 6.5 శాతంగా పేర్కొంది. దానికి 0.2 శాతం తగ్గించి 6.3గా ఐఎంఎఫ్ అంచనా వేసింది. గత జులైలో భారత్ వద్ధి రేటును 6.1 శాతంగా ఐఎంఎఫ్ పేర్కొనడం గమనార్హం. ఈసారి ప్రపంచంలోనే రెండో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉన్న చైనా వద్ధి రేటు భారత్ కంటే తక్కువగా ఉంటుందని ఐఎంఎఫ్ అంచనా వేసింది. ఈ నేపథ్యంలో ఐఎంఎఫ్ అంచనాలను ఉద్దేశించి ప్రధాని మోడి ట్వీట్ చేశారు. " దేశ ప్రజల శక్తి, నైపుణ్యాల కారణంగానే అంతర్జాతీయ ఆర్థికాభివద్ధికి, ఆవిష్కరణలకు భారత్ కేంద్రంగా నిలుస్తోంది. సుసంపన్నమైన భారత్‌ను సాధించే దిశగా మన ప్రయాణాన్ని బలోపేతం చేస్తూ ముందుకు సాగుదాం. మన సంస్కరణలను మరింత పెంచుదాం " అని ప్రధాని పేర్కొన్నారు.

## చంద్రబాబు బెయిల్ పిటిషన్‌పై విచారణ వాయిదా

**టీ మీడియా, అక్టోబర్ 12, అమరావతి :** ఏపీ మాజీ ముఖ్యమంత్రి, తెలుగుదేశం అధినేత చంద్రబాబు నాయుడు దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై హైకోరు గురువారం విచారణ జరిపింది. స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో బెయిల్ కోరుతూ చంద్రబాబు నాయుడు తరఫున న్యాయవాదులు బెయిల్ దాఖలు చేయగా.. విచారణను ఈ నెల 17వ తేదీకి కోర్టు వాయిదా వేసింది. ఈ సందర్భంగా పిటిషన్‌పై కౌంటర్‌ను దాఖలు చేయాలని సీఐడీని కోర్టు ఆదేశించింది. స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్ వ్యవహారంలో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు అరెస్టయిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఆయన జ్యుడీషియల్ కస్టడీలో రాజమండ్రి సెంట్రల్ జైలులో ఉన్నారు. గత 33 రోజులుగా ఆయన సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉంటూ వస్తున్నారు. ఇదిలా ఉండగా.. విజయవాడ ఏసీబీ కోర్టులో పలు కేసులు విచారణకు రానున్నాయి. స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో బెయిల్ కోసం చంద్రబాబు తరఫున న్యాయవాదులు పిటిషన్ దాఖలు చేశారు. ఈ కేసు విచారణకు వచ్చే అవకాశం ఉన్నది. అలాగే అంగళ్లకు సంబంధించిన కేసు ముందస్తు బెయిల్‌పై విచారణ జరుగనున్నది. అదే సమయంలో ఫైబర్‌నెట్ కేసులో సీఐటీ పీటీ వారెంట్ జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ వారెంట్‌పై విచారణకు ఏసీబీ కోర్టు సమ్మతించింది. దీనిపై మధ్యాహ్నం కోర్టు వాదనలు విననున్నది. ఆ తర్వాత తీర్పును వెలువరించే అవకాశాలున్నాయి.




## బీహార్‌లో పట్టాలు తప్పిన నార్త్‌ఈస్ట్ ఎక్స్‌ప్రెస్



**టీ మీడియా, అక్టోబర్ 12, పాట్నా:** బీహార్‌లోని బక్సర్ జిల్లా రఘునాథ్‌పూర్ రైల్వే స్టేషన్ సమీపంలో నార్త్ ఈస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు పట్టాలు తప్పింది. బుధవారం రాత్రి 9.53 గంటలకు రఘునాథ్‌పూర్ సమీపంలో ఢిల్లీలోని ఆనంద్ విహార్ నుంచి అస్సాంలోని కామాఖ్య జంక్షన్‌కు వెళ్తున్న నార్త్ ఈస్ట్ ఎక్స్‌ప్రెస్‌లోని 21 బోగీలు పట్టాలు తప్పాయి. ఈ దుర్ఘటనలో నలుగురు ప్రయాణికులు మృతి చెందారు. మరో 70 మంది గాయపడ్డారు. దీంతో స్థానికులతోపాటు రైల్వే సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. బోగీల్లో చిక్కుకున్న ప్రయాణికులను డీఆర్‌ఎఫ్ సిబ్బంది రక్షించారు. క్షతగాత్రులను బ్రహ్మపూర్ దవాఖానకు తరలించారు. ప్రమాదం నేపథ్యంలో 21 రైళ్లను అధికారులు దారిమళ్లించారు. ఘటనా స్థలాన్ని రైల్వే మంత్రి అశ్విని చౌబే పరిశీలించారు. తన సొంత నియోజకవర్గంలో ఈ దుర్ఘటన చోటుచేసుకోవడం పట్ల ఆయన విచారం వ్యక్తం చేశారు. యుద్ధప్రాతిపదికన రెస్క్యూ ఆపరేషన్ జరుగుతున్నదని, ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, జిల్లా యంత్రాంగం, రైల్వే అధికారులు, స్థానికులు కలిసి సహాయ కార్యక్రమాలు చేపట్టారు. గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించారన్నారు. రెస్క్యూ ఆపరేషన్‌కు సహకారం అందించిన స్థానికులకు ధన్యవాదాలు తెలిపారు. గాయపడిన వారు దవాఖానలో చికిత్స పొందుతున్నారని, ప్రస్తుతం వారంతా క్షేమంగానే ఉన్నారని చెప్పారు. ట్రాక్‌ను పునరుద్ధరిస్తున్నామని, వీలైనంత తొందరగా రైల్వే రాకపోకలను సిద్ధం చేస్తామని వెల్లడించారు.

## షూ ఫ్యాక్టరీలో ఘోర అగ్నిప్రమాదం

**టీ మీడియా, అక్టోబర్ 12, న్యూఢిల్లీ :** ఢిల్లీలోని పీరాగర్హి ప్రాంతంలోని షూ ఫ్యాక్టరీలో గురువారం ఘోర అగ్నిప్రమాదం జరిగింది. తెల్లవారు జామున 4 గంటల సమయంలో ప్రమాదం జరిగినట్లు సమాచారం అందిందని అగ్నిమాపకశాఖ అధికారులు తెలిపారు. సంఘటనా స్థలంలో 30కిపైగా ఫైర్‌టెండర్లను మోహరించి మంటలను అదుపులోకి తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తు న్నట్లు పేర్కొన్నారు. పీరాగర్హి మెట్రో స్టేషన్‌కు సమీపంలో ఉన్న బూట్లకు సంబంధించిన కర్మాగారంలో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. అయితే, ప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదు.

## 40 మంది చిన్నారుల్ని నరికేశారు : ఐడీఎఫ్

**టీ మీడియా, అక్టోబర్ 12, వాషింగ్టన్:** హమాస్ మారణహోమం సృష్టిస్తోంది. వేలాది మంది ఇజ్రాయిల్ ప్రజల్ని చంపేస్తోంది. కిబుజిమ్‌లో హమాస్ ఫైటర్లు బీభత్సం సృష్టించారు. మహిళలు, చిన్నారులు, పసిపిల్లలు, వృద్ధుల్ని అత్యంత కిరాతకంగా చంపేస్తున్నారు. ఇస్లామిక్ ఉగ్రవాదుల తరహాలో హమాస్ తీవ్రవాదులు రెచ్చిపోతున్నారు. కిబుజిమ్‌లో సుమారు 40 మంది చిన్నారుల్ని హమాస్ నరికివేసినట్లు ఇజ్రాయిల్ రక్షణ దళాలు పేర్కొన్నాయి. పసి పిల్లలను చంపేస్తున్నట్లు వార్తలు వస్తున్నాయని, హమాస్ ఇలాంటి దాడులకు పాల్పడుతుందని తొలుత నమ్మలేదని, కానీ సాక్ష్యులు చెబుతున్న విషయాలు భయానకంగా ఉన్నట్లు ఐడీఎఫ్ ప్రతినిధి జోనాథన్ కన్‌రికస్ తెలిపారు. మహిళలు, చిన్నారుల చేతులకు సంకెళ్లు వేసి నరికివేస్తున్నారని ఆయన అన్నారు. హమాస్ క్రూరత్వానికి ప్రపంచానికి చూపేందుకు.. కిబుజిమ్ ప్రాంతానికి అంతర్జాతీయ జర్నలిస్టులను తీసుకువెళ్లారు.



## ఈ నెల 21న సింగపూర్‌లో బతుకమ్మ సంబురాలు

**టీ మీడియా, అక్టోబర్ 12, హైదరాబాద్:** తెలంగాణ సంస్కృతికి ప్రతీక అయిన బతుకమ్మ వేడుకలు ప్రపంచ వ్యాప్తంగా జరుగనున్నాయి. ఈ నెల 14 నుంచి 21 వరకు తీరొక్కపువ్వులతో బతుకమ్మను పేర్చి అంగరంగ వైభవంగా సంబురాలను నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా ఈ నెల 21న సింగపూర్‌లో పూలపండుగ వైభవంగా జరుగనుంది. దీనికి సంబంధించి సింగపూర్ తెలుగు సమాజం ఏర్పాట్లు చేస్తున్నది. అక్టోబర్ 21న సాయంత్రం 5 గంటల నుంచి స్థానిక టాంపనిస్ సెంట్రల్ పార్క్‌లో ఉత్సవాలు నిర్వహిస్తున్నామని, ఆడపడుచులు పెద్దఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకురాలు కురిచేటి స్వాతి కోరారు. ప్రఖ్యాత గాయని వరమ్ ప్రత్యక్ష గానం.. ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణ నిలుస్తుందని ఎస్‌టీఎస్ అధ్యక్షులు బొమ్మారెడ్డి శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. పూల పండుగలో పాల్గొనేవారందరి కోసం భోజన ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అదేవిధంగా ఆకర్షణీయమైన బతుకమ్మలకు మూడు ప్రత్యేక బహుమతులు, లక్కీ విజేతకు 5 గ్రాముల బంగారం బహుమతిగా ఇస్తున్నామని కార్యదర్శి పొలిశెట్టి అనిల్ కుమార్ తెలిపారు. సింగపూర్‌లోని వివిధ ప్రాంతాల నుంచి రవాణ సౌకర్యం కూడా (బస్) ఏర్పాటు చేస్తున్నామన్నారు. దీనికి సంబంధించిన ప్రోమో వీడియోను కూడా యూట్యూబ్‌లో విడుదల చేశారు.



## అన్నవరం సత్యనారాయణ స్వామి వారిని దర్శించుకున్న మంత్రి ఎర్రబెల్లి

**టీ మీడియా, అక్టోబర్ 12, హైదరాబాద్:** ఆంధ్రప్రదేశ్‌లోని అన్నవరం శ్రీ సత్యనారాయణ స్వామి వారిని మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు దర్శించుకున్నారు. గురువారం ఉదయం సతీసమేతంగా అన్నవరం ఆలయానికి చేరుకున్న మంత్రి ఎర్రబెల్లి.. స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వారిని ఆయల పండింతులు స్వామివారి శేష వస్త్రాలతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందచేశారు. ఆలయం వెలుపల మీడియాతో మాట్లాడుతూ.. రానున్న ఎన్నికల్లో తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీ విజయం సాధించాలని కోరుకున్నట్లు చెప్పారు. సీఎం కేసీఆర్ నేతృత్వంలో తెలంగాణ రాష్ట్రం, ప్రజలు సుఖ సంతోషాలతో సుభిక్షంగా ఉండాలని ఆ భగవంతుడిని ప్రార్థించినట్లు తెలిపారు. బీఆర్ఎస్ జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు.



## మంత్రి ప్రశాంత్ రెడ్డికి మాతృ వియోగం

**టీ మీడియా, అక్టోబర్ 12, నిజమాబాద్ :** రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి ప్రశాంత్ రెడ్డి తల్లి మంజులమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. తండ్రి వేముల సురేందర్ రెడ్డి కూడా ఆనారోగ్యంతో ఏడేళ్ల క్రితం మరణించారు. అప్పటి నుంచి తల్లి మంజుల మానసికంగా కృంగి పోయింది. ఆనారోగ్యం పాలైంది. గతంలో బ్రేయిన్ ట్యూమర్ సర్జరీ జరిగింది. అయితే . మళ్లీ ఏడాదిన్నర నుంచి ఆనారోగ్యంతో వుంది, రెండు నెలలుగా హైదరాబాద్ హాస్పిటల్ లో చికిత్స అందిస్తున్నారు.. అయితే పరిస్థితి విషమించి హాస్పటల్ లోనే మృతి చెందారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి కి తల్లి మృతి చెందటంతో బాల్కొండ నియోజక వర్గంలో విషాదఛాయలు నెలకొన్నాయి. ఆయన స్వగ్రామం వేల్పూరు మండల కేంద్రంలో అంత్య క్రియలు జరగనున్నాయి.



# వైఎస్‌ఆర్ జగనన్న ఇళ్ల కాలనీని ప్రారంభించిన సీఎం జగన్

### చంద్రబాబు,పవన్‌పై మండిపాటు

**టీ మీడియా, అక్టోబర్ 12, కాకినాడ :** జిల్లాలోని సామర్లకోటలో వైఎస్ఆర్ జగనన్న కాలనీల్లో లబ్దిదారులకు ఇళ్లను సీఎం జగన్ అందించారు. నవరత్నాలు పేదలందరికీ ఇళ్ల నిర్మాణం కార్యక్రమంలో భాగంగా సామర్లకోటలో నిర్మించిన ఇళ్లను సీఎం జగన్ లబ్దిదారులకు గురువారం లబ్దిదారులతో గహ ప్రవేశం చేయించారు. సామర్లకోటలో లబ్దిదారులతో సామూహిక గహ ప్రవేశాల కార్యక్రమంలో సీఎం జగన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో సీఎం జగన్ ప్రసంగించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఆంధ్ర ప్రదేశ్‌లో 31 లక్షల కుటుంబాలకు ఇళ్ల పట్టాలు ఇచ్చామన్నారు. 22 లక్షల ఇళ్ల నిర్మాణం జరుగుతుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 17 వేల వైఎస్ఆర్ జగనన్న కాలనీలు వస్తున్నాయన్నారు. వేల కోట్లు ఖర్చు పెట్టి ఇంటి కలను సాకారం చేస్తున్నామన్నారు.ఈ సందర్భంగా చంద్రబాబు, పవన్ కళ్యాణ్ సీఎం జగన్ విమర్శలు చేశారు. ఒకసారి లోకల్, మరోసారి నేషనల్, ఇంకోసారి ఇంటర్నేషనల్ అంటూ పవన్ కళ్యాణ్ భార్యల గురించి వ్యాఖ్యలు చేశారు. ఇది దత్తపుత్రుడికి మహిళలపై ఉన్న గౌరవమని సీఎం పవన్ కళ్యాణ్ పై విమర్శలు గుప్పించారు. వివాహ వ్యవస్థపై పవన్ కళ్యాణ్ గౌరవం లేదన్నారు. ప్యాకేజీ స్టార్‌కు గాజువాక, భీమవరంతో సంబంధం లేదని పవన్ కళ్యాణ్ పై విమర్శలు చేశారు సీఎం జగన్. చంద్రబాబు ముఖం చూస్తే స్కాంలు, అవినీతి, జన్మభూమి కమిటీలు గుర్తుకు వస్తాయన్నారు. 14 ఏళ్ల పాటు సీఎంగా పనిచేసిన చంద్రబాబు పేదలకు ఇళ్లు ఎందుకు ఇవ్వలేకపోయారని ఆయన ప్రశ్నించారు. ఈ 52 నెలల కాలంలో చంద్రబాబు నాయుడు ఒక నెల పాటు కంటిన్యూగా రాష్ట్రంలో కన్పించాడా అని సీఎం జగన్ ప్రశ్నించారు. కానీ ఇప్పుడు రాజమండ్రిలో కన్పిస్తున్నాడని సెటైర్లు వేశారు. చంద్రబాబుకు,దత్తపుత్రుడికి, చంద్రబాబు తనయుడికి, చంద్రబాబు బావమరిదికి ఏపీలో ఇళ్లు లేదన్నారు. ఆంధ్రరాష్ట్రాన్ని దోచుకోవడానికి దోచుకున్నది పంచుకోవడానికి హైద్రాబాద్ లో పంచుకోవడమే చంద్రబాబుకు,చంద్రబాబును సమర్ధించే వాళ్లకు ఏపీలో ఇళ్లు లేవన్నారు. చంద్రబాబు ఇళ్లు పక్క రాష్ట్రంలోని హైద్రాబాద్ లో కన్పిస్తుందన్నారు. రాష్ట్ర ప్రజల పట్ల బాబుకు ఉన్న అనుబంధం ఇదే అని జగన్ చెప్పారు. తాను ప్రాతినిథ్యం వహిస్తున్న కుప్పంలో కూడ పేదలకు ఇళ్ల పట్టాలు, ఇళ్ల నిర్మాణం చంద్రబాబు చేయలేదని ఆయన విమర్శించారు. కానీ తమ ప్రభుత్వ హయంలోనే కుప్పంలో ఇళ్ల పట్టాలు, ఇళ్ల నిర్మాణాలు చేసినట్టుగా జగన్ గుర్తు చేశారు. పేదలకు ఇళ్ల స్థలాలిస్తే కులాల మధ్య సమతుల్యం దెబ్బతింటుందని కోర్టుకు వెళ్లారని చంద్రబాబుపై జగన్ మండిపడ్డారు.ప్రభుత్వం ఎంత మంచి చేసినా మంటలు పెట్టి కుట్రలు చేస్తున్నారన్నారు.నా ఎస్సీలు, నా ఎస్టీలు, నా బీసీలు కూడ అనలేరని బాబు తీరుపై విమర్శలు చేశారు.కష్టమొచ్చినా, నష్టమొచ్చినా నిలబడే వాడే నాయకుడన్నారు.రాష్ట్రంలోని 87 శాతం ఇళ్లకు సంక్షేమ పథకాలను అందిస్తున్నామని జగన్ చెప్పారు.



### ఒక్కరోజులో 35 లక్షల

# మద్యం బాటిళ్లు సీజ్

### -. బెల్ట్ షాపుల బెండు తీస్తున్న ఖాఖీలు

**టీ మీడియా, అక్టోబర్ 12,ఆదిలాబాద్:** ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పోలీసులు విస్తృత తనిఖీలు చేపడుతున్నారు. ఈ ఊరు ఆ ఊరు అన్న తేడా లేకుండా మారుమూల గ్రామాల నుంచి మొదలుకొని నియోజకవర్గ కేంద్రాల వరకు మెరుపు దాడులు చేపట్టి అక్రమాలకు అడ్డుకట్ట వేస్తున్నారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలైన రోజు నుండి ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది మొదలు రాత్రి పగలు అన్న తేడాలేకుండా అక్రమార్కుల బెండ్ తీస్తున్నారు. మహారాష్ట్ర నుండి అక్రమంగా తెలంగాణలోకి తరలిస్తున్న మద్యంతో పాటు బెల్ట్ షాపులు పెట్టి మద్యం అమ్మకాలు కొనసాగిస్తున్న నిర్వాహకుల బెండ్ తీస్తున్నారు. కేవలం నాలుగు రోజుల వ్యవదిలోనే వేల లీటర్ల అక్రమ మద్యం పట్టుబడగా.. ఆదిలాబాద్, బోథ్, ఖానాపూర్ నియోజక వర్గాల పరిధిలో ఏకంగా వందల సంఖ్యలో కేసులు నమోదయ్యాయి. ఇన్నాళ్లు బెల్ట్ షాపుల దందా ఏ రేంజ్‌లో సాగిందో దీనిని బట్టి తెలుస్తోంది.ఆదిలాబాద్ జిల్లా బోథ్ నియోజక వర్గం ఇచ్చోడ మండల కేంద్రంలో అయితే ఓ వ్యక్తి ఇంట్లోనే వైన్ షాపును రన్ చేస్తున్నట్టు ఎన్నికల ప్రత్యేక అధికారులు గుర్తించారు. ఇచ్చోడకు చెందిన నరార్ రాజేశ్వర్ అనే బెల్ట్ షాప్ వ్యాపారి వద్ద 1.5 లక్షల విలువ చేసే మద్యాన్ని పట్టుకుని, కేసు నమోదు చేసిన పోలీసులు సదరు మద్యాన్ని ఆప్కారీ శాఖకు ఎన్నికల అదికారుల సమక్షంలో అందజేశారు. ఇదే ఇచ్చోడ ప్రాంతంలో గురువారం ఉదయం నుండి జరిగిన తనిఖీల్లో బెల్ట్ షాపుల్లో ఎనిమిది లక్షల విలువ చేసే మద్యం పట్టుబడినట్టు తెలుస్తోంది.



అటు నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలం గోసంపల్లీ గ్రామంలో ఓ బెల్ట్ షాప్ లో లక్ష రూపాయల విలువ చేసే 193 లీటర్లు మద్యం పట్టుబడగా.. ఖానాపూర్ మండలంలోని మస్కాపూర్ %జవీ=% గార్డెన్ సమీపంలోని ఓ కిరణా షాపులో నడుస్తున్న బెల్ట్ షాప్ లో 21 లీటర్ల మద్యం బాటిళ్లను సీజ్ చేశారు. బైంసా, లక్సెట్టిపేట, జన్నారం, ఉట్నూర్, ఆదిలాబాద్, ఆసిపాబాద్‌లో ఒక్క రోజులోనే 35 పైగా బెల్ట్ షాపుల నిర్వాహకులపై కేసులు నమోదవగా.. 30 లక్షల పైనమద్యం సీజ్ అయినట్టు సమాచారం. ఎన్నికలకు ఇంకా 50 రోజుల సమయం ఉండటంతో ఈ 50 రోజుల్లో ఇంకెంత మద్యం పట్టుబడుతుందో చూడాలి. కొందరు ముందస్తుగా మద్యాన్ని శివారు ప్రాంతాలకు తరలించి రహస్య ప్రాంతాల్లో నిల్వ ఉంచినట్టు సమాచారం. ప్రాణహిత, గోదావరి, పెనుగంగా తీర ప్రాంతాలపై ప్రత్యేక పోకస్ పెట్టిన పోలీసులు ఎక్కడికక్కడ మద్యం అక్రమ రవాణాను కట్టడి చేస్తూ బెల్ట్ నిర్వహకుల బెండ్ తీస్తుండటంతో కల్తీ మద్యానికిఎన్నికల నాటికి కట్టడి పడే అవకాశం ఉందని ఆశభావం వ్యక్తం చేస్తున్నారు మందుబాబులు.

# రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌ను పట్టుకున్న ఏసీబీ అధికారులు

**టీ మీడియా, అక్టోబర్ 12, నిజామాబాద్ క్రైం :** నగరంలోని సౌత్ తహసీల్దార్ కార్యాలయంలో గురువారం మధ్యాహ్నం అవినీతి నిరోధక శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఓ వ్యక్తికి సంబంధించిన ల్యాండ్ విషయంలో క్లియరెన్స్ ఇచ్చేందుకు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ లంచం డిమాండ్ చేసిన విషయంపై ఫిర్యాదు రావడంతో ఏసీబీ నిజామాబాద్ జిల్లా ఇన్‌చార్జి డీఎస్పీ ఆనంద్‌కుమార్ ఆధ్వర్యంలో సోదాలు చేశారు.జిల్లా కేంద్రంలోని కుమార్‌గల్లీ ప్రాంతానికి చెందిన బంటు రామరాజు అనే వ్యక్తికి సంబంధించిన భూమి ప్రొహిబిటెడ్ లిస్ట్ నుంచి తొలగించేందుకు గానూ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మీసాల రాజు రూ.8 వేలు లంచం డిమాండ్ చేశారు. దీంతో బాధితుడు నేరుగా ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. అధికారుల సూచనల మేరకు గురువారం రామరాజు రూ.8 వేలు తీసుకొని సౌత్ తహసీల్ కార్యాలయంలోని ఆర్ఐ రాజు వద్దకు వెళ్లి అతనికి డబ్బులు అందజేశాడు. ఈ క్రమంలో అక్కడే ఉన్న ప్రైవేటు వ్యక్తి మంత్రి హరీశ్‌కుమార్ సైతం ఆర్ఐకి సహకరించాడు. వెంటనే ఏసీబీ అధికారులు దాడి చేసి డబ్బులు తీసుకున్న ఇద్దరిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఆర్ఐ రాజుతో పాటు అతనికి సహకరించిన హరీశ్‌కుమార్‌లపై కేసు నమోదు చేసి, అరెస్టు చేశారు. ఈ దాడిలో ఏసీబీ సీఐలు, సిబ్బంది పాల్గొన్నారు.



# సీఎం కేసీఆర్ వల్లే ప్రతి ఇంటికి మంచినీటి సరఫరా సాధ్యమైంది

### - మంత్రి కేటీఆర్

**టీ మీడియా, అక్టోబర్ 12, హైదరాబాద్ :** స్వతంత్ర భారతదేశంలో ప్రతి ఇంటికి తాగునీటి కనెక్షన్‌ను అందించేందుకు మిషన్ భగీరథ పథకాన్ని తీసుకొచ్చిన ఏకైక రాష్ట్రం తెలంగాణ మాత్రమే అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు. దేశంలో ప్రతి ఇంటికి మంచినీటి సరఫరా అందించిన రాష్ట్రాలు కేంద్ర పాలిత ప్రాంతాల జాబితాను ది ఇండియన్ ఇండెక్స్ అనే సంస్థ ట్వీట్ చేసింది. ఈ జాబితాలో తెలంగాణ మొదటి స్థానంలో నిలిచింది. దీనిపై మంత్రి కేటీఆర్ స్పందించారు. తెలంగాణ అగ్రస్థానంలో ఉండటంపై కేటీఆర్ హర్షం వ్యక్తం చేస్తూ రీట్వీట్ చేశారు కేటీఆర్. విజన్ ఉన్న కేసీఆర్ తెలంగాణకు సీఎంగా ఉండటం వల్లే ఇది సాధ్యమైందని మంత్రి పేర్కొన్నారు. ఈ పథకం తెలంగాణలో విజయవంతమైన తర్వాతే కేంద్ర ప్రభుత్వం హర్ ఘర్ జల్ అనే పథకాన్ని తీసుకొచ్చిందని తెలిపారు. ఇవాళ తెలంగాణ ఏది చేస్తే మిగిలిన రాష్ట్రాలు అనుసరిస్తున్నాయని మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు.



## ఎలక్షన్ ప్రచార ధరల పట్టికను విడుదల చేసిన ఈసీ

**టీ మీడియా, అక్టోబర్ 12, హైదరాబాద్ :** తెలంగాణలో ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసిన కేంద్ర ఎన్నికల సంఘం ఈసారి అభ్యర్థుల ప్రచార ఖర్చుల్లో కచ్చితత్వం కోసం పలు చర్యలు చేపట్టింది. తప్పుడు లెక్కలతో ప్రచార వ్యయాన్ని తగ్గించి చూపే అవకాశం లేకుండా ధరల జాబితా విడుదల చేసింది. ప్రచారంలో పాల్గొనే కార్యకర్తల కాఫీ, టీ, టిఫిన్, బిర్యానీ.. తదితర వాటికి దేనికెంత అనే వివరాలతో పట్టిక రూపొందించింది. ఇందులో పేర్కొన్న ధరల ప్రకారమే అభ్యర్థి తన ఖర్చుల లెక్కలు చూపించాలని పేర్కొంది. ఈ ఖర్చు రూ.40 లక్షలకు మించకూడదని తెలిపింది. ఎన్నికల సంఘం విడుదల చేసిన జాబితాలో ధరలు ఇలా ఉన్నాయి..




**ఎలక్షన్ కమిషన్ నిర్ణయించిన ధరల పట్టిక :**

ఫంక్షన్ హాల్ రూ.15,000
ఎల్ఈడీ తెర రూ.15,000
మినీ బస్సు రూ.3,500, పెద్ద బస్సు రూ.6,000
డ్రోన్ కెమెరా రూ.5,000
లీటర్ వాటర్ బాటిల్ రూ.20
టిఫిన్ రూ.35
(గ్రామీణ ప్రాంతంలో రూ.30)
వెజిటబుల్ బిర్యానీ రూ.80
(గ్రామాల్లో రూ.70)
మటన్ బిర్యానీ రూ.180 (గ్రామీణ ప్రాంతంలో రూ.150)
భారీ బెలూన్ రూ. 4,000
డీసీఎం వ్యాన్ రూ. 3,000
ఇన్నోవా రూ. 6,000
పెద్ద సమోసా రూ.10
పులిహోర రూ.30
(గ్రామీణ ప్రాంతంలో రూ.20)
సాదా భోజనం రూ.80
చికెన్ బిర్యానీ రూ.140
(గ్రామాల్లో రూ.100)

# కారును పోలిన గుర్తులను తొలగించాలి

### - హైకోర్టులో బీఆర్ఎస్ పిటిషన్

**టీ మీడియా, అక్టోబర్ 12, హైదరాబాద్ :** కారును పోలిన గుర్తులను తొలగించేలా ఎన్నికల కమిషన్‌కు ఆదేశాలను జారీ చేయాలని కోరుతూ బీఆర్ఎస్ పార్టీ ఢిల్లీ హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేసింది. ఎన్నికల కమిషన్ ఫ్రీ సింబల్స్ లిస్ట్‌లో ఉన్న రోడ్డు రోలర్‌లాంటి గుర్తులతో బీఆర్ఎస్ పార్టీకి నష్టం కలుగుతుందని పిటిషన్‌లో పేర్కొనగా.. దీనిపై నేడు విచారణకు వచ్చే అవకాశం ఉన్నది. అయితే, బీఆర్ఎస్ ఎన్నికల గుర్తయిన కారును పోలిన గుర్తులను ఏ పార్టీ, అభ్యర్థికి కేటాయించొద్దని ఎన్నికల కమిషన్‌ను బీఆర్ఎస్ కోరుతూ వస్తున్నది. 2011లో రోడ్డు రోలర్‌ను ఎన్నికల కమిషన్ తొలగించింది. గుర్తును మళ్లీ ఎన్నికల కమిషన్ చేర్చడంతో అభ్యంతరం తెలుపుతున్నది. రోడ్డు రోలర్‌తో పాటు చపాతి రోలర్, సోప్‌డిష్, టెలివిజన్, కుట్టుమిషన్, ఓడ, ఆటోరిక్షా, ట్రక్కు గుర్తులు కారును పోలి ఉండడంతో త్వరలో జరిగే ఎన్నికల్లో ఎవరికీ కేటాయించొందని బీఆర్ఎస్ ఎన్నికల కమిషన్‌కు విజ్ఞప్తి చేసింది. ఆయా గుర్తులతో బీఆర్ఎస్‌కు నష్టం జరుగుతుందని ఈసీ దృష్టికి తీసుకెళ్లింది. ఇటీవల కేంద్రం ఎన్నికల సంఘం రాష్ట్రంలో పర్యటించిన సందర్భంలోనూ కారు గుర్తును పోలిన ఫ్రీ సింబల్స్‌ను తొలగించాలని బీఆర్ఎస్ పార్టీ కోరింది. అయితే, ఇప్పటి వరకు ఎన్నికల సంఘం స్పందించకపోవడంతో పిటిషన్‌ను దాఖలు చేసింది.




## టీటీడీ తిరుపతి అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలి

**టీ మీడియా, అక్టోబర్ 12, తిరుమల :** దశాబ్దాల కాలంగా తిరుపతిలో టీటీడీకి సంబంధించిన విద్యాసంస్థలు, హాస్పిటల్స్ ఇంకా ఎన్నో సంస్థలు ఏర్పడి టీటీడీ నిధులతోనే నేటికీ కొనసాగుతున్నాయని అలాంటిది నిత్యం శ్రీవారి దర్శనానికి వచ్చే భక్తుల సేవ కై తిరుపతి నగరం నిత్యం ఎదురుచూస్తున్నదని అలాంటి తిరుపతికి తిరుమల తిరుపతి దేవస్థానం నిధులను ఒక్క శాతం వెచ్చించడం ధర్మమని తిరుమల తిరుపతి దేవస్థానం ఉద్యోగ సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ కన్వీనర్లు వెంకటేశం, వెంకటరమణారెడ్డి లు విజ్ఞప్తి చేశారు. తిరుపతి ప్రెస్క్లబ్లో గురువారం మీడియా ముందు వీరు మాట్లాడుతూ ఈనెల తొమ్మిదవ తేదీ టీటీడీ పాలకమండలి సమావేశంలో ఒక శాతం తితిదే నిధులు తిరుపతి అభివృద్ధి కోసం కేటాయించడాన్ని స్వాగతిస్తున్నట్లు వీరు హర్షం వ్యక్తం చేశారు. టీటీడీ ఉద్యోగులకు ఎంతోకాలంగా దశలవారీగా ఇస్తున్న ఇంటి స్థలాలు ఫ్రీగా ఇవ్వడం లేదని తమ వేతనాలలో నెల నెల కట్ చేసుకోవడం ద్వారానే తమకు ఇంటి ప్లాట్లు వచ్చాయని ఆనాటి గవర్నమెంట్ వాల్యూ ప్రకారమే తాము ఇంటి స్థలాలు తీసుకున్నామని స్పష్టం చేశారు. ఉచితంగా తమకు టీటీడీ ఏమి ఇవ్వదని తెలియజేశారు. రాజకీయ పార్టీలతో సంబంధం లేకుండా తిరుపతి అభివృద్ధి కోసం. ఒక్కసాతం నిధుల కేటాయింపును ప్రతి ఒక్కరూ. ఆహ్వానిస్తూ తిరుపతి అభివృద్ధికి తోడ్పడాలని వీరు కోరారు. ఈ. విలేకరుల సమావేశంలో టిటిడి ఉద్యోగ సంఘాల జేఏసీ నాయకులు ప్రసాదరావు, భాస్కర్, ఇందిరా కల్పన, రత్న ప్రభాకర్, ఆదిలక్ష్మి , రామచంద్ర , రవికుమార్ , పద్మనాభం మునికృష్ణ , గుణశేఖర్ తదితరులు పాల్గొన్నారు.




## డబ్బు, మద్యంతో ప్రజల్ని మభ్య పెట్టాలని చూస్తారు ఏలాంటి ప్రలోభాలకు లొంగకండి

### - బీఎస్పీ ఎమ్మెల్యే అభ్యర్థి దాసరి ఉష

**టీ మీడియా, అక్టోబర్ 12, పెద్దపల్లి బ్యూరో :** కాల్వ శ్రీరాంపూర్ మండలంలోని మొట్లపల్లి గ్రామంలో 53వ రోజు మన ఊరు మన ఉష కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి బీఎస్పీ పెద్దపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి దాసరి ఉష హాజరై ఇంటింటికి ఏనుగు గుర్తును పరిచయం చేస్తూ కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రభుత్వాలు చేస్తున్న దోపిడీని ప్రజలకు వివరిస్తూ బీఎస్పి అధికారంలోకి వస్తే అందించే సంక్షేమ పథకాల గురించి ప్రజలకు తెలియజేశారు అనంతరం దాసరి ఉష మాట్లాడుతూ ఈ 48 రోజులలో మద్యం ఏరులై పారుతుందని, డబ్బుతో విచ్చలవిడిగా ప్రజల్ని మభ్య పెట్టాలని చూస్తారని వాటన్నింటికీ దూరంగా ఉండి ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా కేవలం బహుజన రాజ్యమే లక్ష్యంగా ముందుకు వెళ్లాలని అన్నారు ఈ కార్యక్రమంలో బీఎస్పీ కాల్వ శ్రీరాంపూర్ మండల అధ్యక్షులు కుమ్మరికుంట రవి కుమార్ మండల ఉపాధ్యక్షులు కొర్రె కిరణ్, మండల కోశాధికారి రాము, కాల్వ శ్రీరాంపూర్ గ్రామ మహిళా కన్వీనర్ కుమ్మరి కుంట శారద, మెర్గవేన సంపత్, స్థానిక గ్రామస్తులు మహిళలు తదితరులు పాల్గొన్నారు



# కోర్టు అనుమతితో శిశువును చంపాలనుకుంటున్నారా

## - సీజేఐ చంద్రచూడ్



**టీ మీడియా, అక్టోబర్ 12, న్యూఢిల్లీ:** సుప్రీంకోర్టు లో గురువారం సీజే డీవై చంద్రచూడ్ ఓ కేసులో సీరియస్ అయ్యారు. 26 వారాల ప్రెగ్నెంట్ పెట్టుకున్న అభ్యర్థన కేసులో ఆయన కొన్ని కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రెగ్నెన్సీ తొలగించుకునేందుకు అవకాశం కల్పించాలని కోరుతూ పెట్టుకున్న రిక్వెస్ట్‌పై స్పందిస్తూ.. కోర్టు ఆర్డర్ ద్వారా పర్మిషన్ తీసుకుని శిశువును చంపాలనుకుంటున్నారా అని చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్ ప్రశ్నించారు. ఈ కేసులో శుక్రవారం మళ్లీ విచారణ చేపట్టనున్నారు. అబార్షన్ అపీల్ గురించి ఆ మహిళతో కేంద్రం తరపున లాయర్ మాట్లాడాలని సుప్రీంకోర్టు సూచించింది. సీజే నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం ఈ కేసును విచారిస్తున్నది. 26 వారాల గర్భాన్ని తొలగించుకునేందుకు అనుమతి ఇవ్వాలని ఓ మహిళా సుప్రీంలో పిటీషన్ వేసింది. ఇద్దరు పిల్లల తల్లి అయిన ఆమె ఇప్పటికే డిప్రెషన్‌తో బాధపడుతున్నట్లు ఆ పిటీషన్‌లో పేర్కొన్నారు. మానసికంగా, ఆర్థికంగా మూడవ శిశువును పెంచే స్థితిలో తాను లేనట్లు ఆమె ఆ పిటీషన్‌లో తెలిపింది. ఈ కేసులో అబార్షన్‌కు అనుమతి ఇస్తూ అక్టోబర్ 9వ తేదీన కోర్టు ఆదేశాలు ఇచ్చింది. అయితే ఎయిమ్స్ వైద్యుల బృందం మాత్రం అబార్షన్‌కు నిరాకరించారు. జస్టిస్ హిమా కోహ్లీ, జస్టిస్ బీవీ నాగరత్నతో కూడిన ఇద్దరు సభ్యుల ధర్మాసనం బుధవారం ఈ కేసులో భిన్న అభిప్రాయాలు వ్యక్తం చేసింది. దీంతో ఆ కేసును గురువారం సీజే చంద్రచూడ్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం టేకప్ చేసింది. నేడు మళ్లీ తీర్పు ఇవ్వనున్నారు.

# శ్రీవారి వివిధ సేవల ఆన్ లైన్ టికెట్ల విడుదల షెడ్యూల్



**టీ మీడియా, అక్టోబర్ 12, తిరుమల :** 2024 జనవరి మాసం శ్రీవారి ఆర్జిత సేవా టికెట్ల కోటాను అక్టోబర్ 18న ఆన్‌లైన్‌లో టీటీడీ విడుదల చేయనుంది. సుప్రభాతం, తోమాల, అర్చన, అష్టదళపాదపద్మారాధన ఆర్జిత సేవల ఆన్‌లైన్ లక్కీడిప్ కోసం అక్టోబర్ 18వ తేదీన ఉదయం 10 గంటల నుంచి 20వ తేదీ ఉదయం 10 గంటల వరకు భక్తులు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునే అవకాశాన్ని టీటీడీ కల్పించింది. 22న 10 గంటలకు లక్కీ డిప్‌లో సేవా టిక్కెట్లను టీటీడీ కేటాయించనుంది. అలాగే కల్యాణోత్సవం, ఆర్జిత బ్రహ్మోత్సవం, ఊంజల్ సేవ, సహస్రదీపాలంకార సేవా టికెట్లను అక్టోబర్ 21న ఉదయం 10 గంటలకు విడుదలకానున్నాయి. వర్చువల్ సేవా టికెట్లను అక్టోబర్ 21న, మధ్యాహ్నం 3 గంటలకు టీటీడీ విడుదల చేయనుంది. అంగప్రదక్షిణం టోకెన్ల కోటా అక్టోబర్ 23న, ఉదయం 10 గంటలకు విడుదలకానుంది. శ్రీవాణి ట్రస్టు బ్రేక్ దర్శనం, గదుల కోటాను అక్టోబర్ 23న, ఉదయం 11 గంటలకు టీటీడీ విడుదల చేయనుంది. అలాగే వృద్ధులు, దివ్యాంగుల దర్శన టోకెన్ల కోటాను అక్టోబర్ 23న మధ్యాహ్నం 3 గంటలకు తిరుమల తిరుపతి దేవస్థానం విడుదల చేయనుంది. వీటితో పాటు ప్రత్యేక ప్రవేశ దర్శనం రూ.300 టికెట్ల కోటాను అక్టోబర్ 24న, తిరుమల, తిరుపతిలో వసతి గదుల బుకింగ్‌ను అక్టోబర్ 25న, ఉదయం 10 గంటలకు టీటీడీ విడుదల చేయనుంది.

## 54 అసెంబ్లీ నియోజకవర్గాలకు

# బీఆర్ఎస్ పార్టీ ఇంఛార్జిలు నియామకం

## -కేటీఆర్, హరీశ్‌రావు వర్చువల్‌గా సమావేశం

**టీ మీడియా, అక్టోబర్ 12,హైదరాబాద్ :** తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో 54 అసెంబ్లీ నియోజకవర్గాలకు బీఆర్ఎస్ పార్టీ ఇంఛార్జిలను నియమించింది. ఈ సందర్భంగా నియోజకవర్గ ఇంఛార్జిలతో మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు వర్చువల్‌గా సమావేశం నిర్వహించారు. బీఆర్ఎస్ విజయానికి అనుసరించాల్సిన కార్యాచరణపై కేటీఆర్, హరీశ్‌రావు దిశానిర్దేశం చేశారు.కేటీఆర్ మాట్లాడుతూ..



అన్ని నియోజకవర్గాల్లో బీఆర్ఎస్‌కు సానుకూల వాతావరణం ఉందన్నారు. కేసీఆర్ నాయకత్వానికి ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని తెలిపారు. పదేళ్ల అభివృద్ధిని ప్రతి గడపకు తీసుకెళ్లి ఓట్లు అడగాలని సూచించారు. విపక్షాలకు ఎన్నికలు కేవలం హామీలు ఇచ్చే వేదికలు.. బీఆర్ఎస్‌కు ఎన్నికలంటే పదేళ్ల ప్రగతిని వివరించే అవకాశమని తెలిపారు. సంక్షేమం, అభివృద్ధి ఫలాలు అందుకున్న ప్రతి ఒక్కరితో మమేకం కావాలని ఆదేశించారు.

హరీశ్‌రావు మాట్లాడుతూ.. పార్టీ శ్రేణులను సమన్వయం చేసుకొని ప్రచారం నిర్వహించాలన్నారు. పకడ్బందీ ప్రణాళికతో ఎన్నికల ప్రచారం నిర్వహించి, బీఆర్ఎస్ గెలుపునకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. గతం కంటే అత్యధిక స్థానాలను గెలిచేందుకు కృషి చేయాలన్నారు హరీశ్‌రావు.

### ఇంఛార్జిలు వీరే

1. బెల్లంపల్లి – ఎంపీ వెంకటేశ్ నేత
2. మంచిర్యాల – ఎమ్మెల్సీ భానుప్రసాద్
3. ఖానాపూర్ – ఎమ్మెల్సీ దండె విఠల్
4. బోథ్ – మాజీ ఎంపీ నగేశ్
5. ముధోల్ – మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీశ్ కుమార్
6. బోధన్ – ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత
7. ఎల్లారెడ్డి –మాజీ ఎమ్మెల్సీ వీ గంగాధర్ గౌడ్
8. కామారెడ్డి – ఎమ్మెల్యే గంప గోవర్ధన్, ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి, మంత్రి కేటీఆర్
9. నిజామాబాద్ అర్బన్ –ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత
10. జగిత్యాల – ఎమ్మెల్సీ రమణ, మాజీ మంత్రి రాజేశం గౌడ్
11. రామగుండం – మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్
12. మంథని – ఈద శంకర్ రెడ్డి
13. పెద్దపల్లి – చైర్మన్ రవీందర్ సింగ్
14. చొప్పదండి – మంత్రి గంగుల కమలాకర్
15. వేములవాడ – మాజీ ఎంపీ వినోద్ కుమార్
16. మానకొండూరు – సుడా చైర్మన్ జీవీ రామకృష్ణ
17. మెదక్ – కే తిరుపతి రెడ్డి
18. ఆందోల్ – మాజీ ఎమ్మెల్సీ ఫరూఖ్ హుస్సేన్
19. నర్సాపూర్ – ఎమ్మెల్సీ వెంకటరాం రెడ్డి
20. జహీరాబాద్ – మాజీ ఎమ్మెల్సీ దేవీ ప్రసాద్
21. సంగారెడ్డి – చైర్మన్ వీ భూపాల్ రెడ్డి, చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్
22. దుబ్బాక – చైర్మన్ బాలమల్లు
23. గజ్వేల్ – మంత్రి హరీశ్ రావు, ఎమ్మెల్సీ యాదవ రెడ్డి, చైర్మన్ ప్రతాప్ రెడ్డి
24. మల్కాజ్‌గిరి – ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు
25. ఉప్పల్ – చైర్మన్ రావుల శ్రీధర్ రెడ్డి
26. ఇబ్రహీంపట్నం – మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణా రెడ్డి
27. చేవెళ్ల – ఎంపీ రంజిత్ రెడ్డి
28. వికారాబాద్ – ఎంపీ రంజిత్ రెడ్డి
29. ముషీరాబాద్ – ఎమ్మెల్సీ ఎంఎస్ ప్రభాకర్
30. అంబర్‌పేట్ – కట్టెల శ్రీనివాస్ యాదవ్, అడ్వకేట్ మోహన్ రావు
31. సికింద్రాబాద్ కంటోన్మెంట్ – మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్
32. మక్తల్ – చైర్మన్ ఆంజనేయులు గౌడ్
33. గద్వాల్ – మాజీ చైర్మన్ రాకేశ్ చిరుమళ్ల
34. అలంపూర్ – ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామ్ రెడ్డి
35. అచ్చంపేట – చైర్మన్ ఇంతియాజ్ ఇషాక్
36. కల్వకుర్తి – చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి
37. కొల్లాపూర్ – ఎంపీ రాములు
38. నాగార్జున సాగర్ – ఎమ్మెల్సీ కోటి రెడ్డి, రామచంద్ర నాయక్
39. హుజూర్ నగర్ – విజయసింహా రెడ్డి
40. కోదాడ – ఎమ్మెల్సీ టీ రవీందర్ రావు
41. నల్లగొండ – జడ్పీ చైర్మన్ బండా నరేందర్ రెడ్డి
42. నకిరేకల్ – ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్
43. జనగామ – మాజీ ఎమ్మెల్సీ బీ వెంకటేశ్వర్లు, చైర్మన్ రాజయ్య, మంత్రి హరీశ్‌రావు
44. మహబూబాబాద్ – మంత్రి సత్యవతి రాథోడ్
45. నర్సంపేట – చైర్మన్ వీ ప్రకాశ్
46. వరంగల్ ఈస్ట్ – మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్
47. భూపాలపల్లి – ఎమ్మెల్సీ బసవరాజు సారయ్య
48. ములుగు – ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి
49. ఇల్లందు – ఎంపీ వద్దిరాజు రవిచంద్ర
50. మధిర – మంత్రి పువ్వాడ అజయ్, కొండబాల కోటేశ్వర్ రావు
51. వైరా – ఎంపీ నామా నాగేశ్వర్ రావు
52. సత్తుపల్లి – ఎంపీ పార్థసారథి రెడ్డి
53. అశ్వరావుపేట – శేషగిరావు(ఖమ్మం డీసీఎంఎస్)
54. భద్రాచలం – ఎమ్మెల్సీ తాత మధు

# వివరాలన్నీ తప్పనిసరిగా వెల్లడించాల్సిందే

## -విద్యాసంస్థలకు యుజిసి ఆదేశం



**టి మీడియా, అక్టోబర్ 12,న్యూఢిల్లీ :** ఉన్నత విద్యాసంస్థల్లో పారదర్శకతను పెంచేలా, విద్యార్థులు తప్పుదోవపట్టకుండా ఉండేందుకు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యుజిసి)కీలక నిర్ణయం తీసుకుంది. దేశవ్యాప్తంగా ఉన్న కళాశాలలు, విశ్వవిద్యాలయాలు, ఉన్నత విద్యాసంస్థలు తమ వెబ్‌సైట్‌లలో తప్పనిసరిగా ఉంచాల్సిన కంటెంట్‌కు సంబంధించి ఒక చెక్ లిస్ట్‌ను విడుదల చేసింది. విద్యా సంస్థలన్నీ ఇకపై తమ వెబ్‌సైట్లలో ఫీజులు, రిఫండ్ పాలసీ, హాస్టల్ వసతులు, స్కాలర్‌షిప్ ప్రోగ్రామ్స్, ర్యాంకింగ్స్, అక్రిడిటేషన్ వంటి వివరాలను తప్పనిసరిగా పొందుపరచాల్సిందేనని స్పష్టం చేసింది. కొన్ని విశ్వవిద్యాలయాలు తమ వెబ్‌సైట్లలో ప్రాథమిక సమాచారాన్ని కూడా పేర్కొనకపోవడం, కొన్ని వెబ్‌సైట్లు సరిగా పనిచేయకపోవడం, అప్‌డేట్ చేయకపోవడం వంటి ఫిర్యాదుల నేపథ్యంలో ఈ చర్యలు చేపట్టినట్టు యూజీసీ ఛైర్మన్ ప్రొఫెసర్ జగదీశ్ కుమార్ తెలిపారు.

కాలేజీలు/యూనివర్సిటీలకు సంబంధించిన ప్రాథమిక సమాచారం అందుబాటులో లేకపోతే విద్యార్థులకు చాలా అసౌకర్యంగా ఉంటుందని జగదీశ్ కుమార్ అన్నారు. అందువల్లే విద్యాసంస్థలు వెబ్‌సైట్లలో పొందుపరచాల్సిన అంశాలతో చెక్‌లిస్ట్‌ను తయారు చేసినట్టు తెలిపారు. ఈ చెక్‌లిస్ట్‌లో ఉన్నత విద్యాసంస్థలు/వర్సిటీల పేటెంట్ల వివరాలు, విదేశీ, పరిశ్రమలతో సహకారం, అంతర్గత నాణ్యత భరోసా కేంద్రం, అంతర్గత ఫిర్యాదుల కమిటీ, హెల్ప్‌లైన్‌తో కూడిన యాంటీ ర్యాగింగ్ సెల్, సమాన అవకాశాలకు సంబంధించిన విభాగం, పూర్వ విద్యార్థుల సంఘం, అంబుడ్స్‌మన్, అనుబంధ కళాశాలలు, ఆఫ్‌షోర్ క్యాంపస్‌లు, విద్యార్థుల ఫిర్యాదుల పరిష్కార కమిటీ, సామాజిక, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల విభాగం, పౌర సంబంధాల విభాగం, అప్పిలేట్ అథారిటీ తదితర వివరాలతో యూజీసీ చెక్‌లిస్ట్ రూపొందించింది.

# ఎవరి ఫ్యాన్లు వారే తెచ్చుకోండి.

## -అక్కడి ప్రభుత్వ ఆసుపత్రిలో విచిత్ర పరిస్థితి




**టి మీడియా, అక్టోబర్ 12,పీలేరు:** రాష్ట్రంలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో మౌలిక సదుపాయాల కొరత తారా స్థాయిలో ఉంది. సాధారణంగా ఏ ప్రభుత్వ ఆసుపత్రిలోనైనా వైద్యం, చికిత్స, మందులు, వైద్య పరీక్షలు అన్నీ ఉచితంగానే అందిస్తారు. ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లే స్తోమత లేనివారు ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే వైద్యం చేయించుకుని సర్దుకుంటారు. ప్రసవాలు, కుటుంబ నియంత్ర ఆపరేషన్ల వంటి వాటి కోసం ఎక్కువ మంది ప్రజలు ప్రభుత్వ ఆసుపత్రులకు వస్తుంటారు. కానీ రాష్ట్రంలోని పలు ప్రభుత్వ ఆసుపత్రుల్లో సరైన సౌకర్యాలు లేక ప్రజలు అల్లాడిపోతున్నారు. ఆసుపత్రుల్లో కనీస సదుపాయాలు లేక.. ఎవరికి విన్నవించుకోవాలో తెలియక అవస్థలు పడుతున్నారు. రోగులకు కనీసం ఫ్యాన్ సదుపాయం కూడా లేక ఉక్కపోతతో అల్లడిపోతున్నారు. రాష్ట్రంలోని అన్నమయ్య జిల్లా పీలేరు ప్రాంతీయ ప్రభుత్వ ఆసుపత్రిలోని పరిస్థితి ఇది. ఇక్కడ వైద్యం చేయించుకోవాలంటో తమ ఫ్యాన్ తామే తెచ్చుకోవల్సిన విచిత్ర పరిస్థితి నెలకొంది. ఇక్కడి సర్కార్ ఆసుపత్రిలో వైద్యం ఉచితమే కానీ, ఎవరి ఫ్యాన్లు వారే తెచ్చుకోవాలి అనేలా తయారైంది ఇక్కడి పరిస్థితి.పీలేరు ప్రభుత్వ ఆసుపత్రి పాత భవనంలోని ప్రసూతి వార్డులో 2 సీలింగ్ ఫ్యాన్లు ఉన్నాయి. కానీ అవి పాతవి కావడంతో సరిగ్గా తిరగక పోవడంతో వాటి నుంచి వచ్చే గాలి ఆ వార్డులోని వారికి సరిపోవడం లేదు. దీంతో వార్డులోని గర్భిణీ మహిళలు ఉక్కపోత తట్టుకోలేక అల్లాడిపోతున్నారు. అక్కడి రోగుల పరిస్థితిని క్యాష్ చేసుకోవడానికి కొందరు ప్రైవేట్ వ్యక్తులు ఆసుపత్రి బయట అద్దెకు ఫ్యాన్లు ఇవ్వబడునంటూ వ్యాపారం ప్రారంభించారు. ఆసుపత్రి ఆవరణలోని ప్రైవేటు మందుల షాపుల్లోనూ ఫ్యాన్లను అద్దెకు ఇవ్వడబునంటూ బోర్డులు పెట్టారు.

ఇలా అత్యవసర పరిస్థితుల్లో.. గత్యంతరం లేక ప్రసూతి వార్డులోని మహిళల బంధువుల స్టాండింగ్ ఫ్యాన్లకు అద్దెకు తీసుకెళ్తున్నారు. ఇలా ఒక్కో ఫ్యాన్ కోసం రోజుకు రూ.500 డిపాజిట్ చేస్తే, రోజుకు రూ.50ల వరకు అద్దె వసూలు చేస్తున్నారు. ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లలేక ప్రభుత్వ ఆసుపత్రికి వస్తే రోగుకుల కనీసం సదుపాయాలు కూడా కల్పించరా అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదని వాపోతున్నారు రోగులు.

# నారా లోకేష్ బెయిల్ పిటిషన్ డిస్పోజ్



**టీ మీడియా, అక్టోబర్ 12, అమరావతి :** స్కిల్ డెవలప్‌మెంట్అక్రమ కేసులో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌కు హైకోర్టులో భారీ ఊరట లభించింది. గురువారం ఉదయం నుంచి హైకోర్టులో సుదీర్ఘ విచారణ జరగ్గా మధ్యాహ్నానికి లోకేష్‌పై ఉన్న స్కిల్ కేసును హైకోర్టు క్లోజ్ చేసింది. దీంతో లోకేష్‌కు బిగ్ రిలీఫ్ దక్కినట్టయ్యింది. లోకేష్‌ను స్కిల్ కేసులోనిందితుడిగా తాము చేర్చలేదని సీఐడీ చెప్పింది. ముద్దాయిగా చూపని కారణంగా ఆయన్ను అరెస్ట్ చేయబోమని కోర్టుకు సీఐడీ తెలిపింది. ఒకవేళ ఈ కేసులో నిందితుడిగా చేరిస్తే 41-ఏ కింద నోటీసులు ఇస్తామని న్యాయస్థానానికి సీఐడీ అధికారులు వెల్లడించారు. సెక్షన్ ల ప్రకారం విచారిస్తామని తెలిపారు. దీంతో లోకేష్ ముందస్తు బెయిల్ పిటిషన్ కు ముగింపు పలికింది.

# శ్రీరాంపూర్ మండల కేంద్రానికి కాంగ్రెస్ పదవుల పంట

## - జిల్లా ఉపాధ్యక్షులు ఏండీ మునీర్



**టీ మీడియా, అక్టోబర్ 12, పెద్దపల్లి బ్యూరో :** పెద్దపల్లి జిల్లా కాల్వ శ్రీరాంపూర్ మండల కేంద్రానికి కాంగ్రెస్ పార్టీలో సుదీర్ఘకాలం పనిచేస్తున్న మాజీ మండల అధ్యక్షుడు ఎండి మునీర్ కు కు పెద్దపెల్లి జిల్లా ఉపాధ్యక్ష పదవి రావడం జరిగింది. అదేవిధంగా ఇటీవల కాంగ్రెస్ పార్టీలో రేవంత్ రెడ్డి సమక్షంలో చేరిన యంగ్ అండ్ డైనమిక్ పులి ఇంద్రకరణ్ రెడ్డి కి జిల్లా ప్రధాన కార్యదర్శి పదవి వరించింది. ఈ పదవులు రావడానికి ఎంతో కృషి చేసిన మాజీ మంత్రి ఏఐ సి సి కార్యదర్శి దుద్దిల్ల శ్రీధర్ బాబు పెద్దపల్లి నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణ రావు జిల్లా అధ్యక్షులు రాజ్ ఠాగూర్ మక్కాన్సింగ్ కాల్వ శ్రీరాంపూర్ మాజీ ఎంపీపీ గోపగోని సారయ్య గౌడ్ మా తోటి కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులకు అందరికీ మా హృదయపూర్వక ధన్యవాదాలు కృతజ్ఞతలు ఈ సందర్భంగా తెలుపుతున్నామని వారు అన్నారు. రాబోయే రోజుల్లో పెద్దపెల్లి నియోజకవర్గం లో కాంగ్రెస్ జెండా ఎగురవేయడానికి తమ వంతు కృషి చేసి కార్యకర్తలను కలుపుకుంటూ విజయానికి సహకరిస్తామని వారు అన్నారు.

## ఎండి ఆర్ హైస్కూల్ నందు ముందస్తు బతుకమ్మ వేడుకలు



**టి మీడియా, అక్టోబర్ 12, హుజూర్ నగర్ :** సూర్యాపేట జిల్లా హుజూర్నగర్ నియోజకవర్గ పరిధిలోని ఎండిఆర్ హైస్కూల్ నందు గురువారం బతుకమ్మ ఉత్సవాలను అంగరంగ వైభవంగా ఎండిఆర్ విద్యాసంస్థల చైర్మన్ మేరెడ్డి దామోదర్ రెడ్డి, ప్రిన్సిపల్ శ్రీ నలబోలు భూపాల్ రెడ్డి, ఏవో నర్సిరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమం ఎంతో ఘనంగా జరిగింది. ఇట్టి కార్యక్రమంలో ఎండిఆర్ స్కూల్ విద్యార్థిని విద్యార్థులు, ఉపాధ్యాయనీ, ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడంలో ఎండిఆర్ విద్యాసంస్థ ఎప్పుడు అగ్రస్థానంలో ఉంటుందని, తెలియజేశారు. ఇట్టి కార్యక్రమంలో ఎండిఆర్ హై స్కూల్ యాజమాన్యం ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# అభివృద్ధి ప్రదాతని గెలిపించండి

## - ఎమ్మెల్యే తనయుడు



**టీ మీడియా, అక్టోబర్ 12, పెద్దపల్లి బ్యూరో :** పెద్దపల్లి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన అభివృద్ధి ప్రదాత ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి ని మరోసారి గెలిపించాలని ఎమ్మెల్యే తనయుడు బీఆర్ఎస్ యువనాయకులు దాసరి ప్రశాంత్ రెడ్డి కోరారు. గురువారం కాల్వశ్రీరాంపూర్ మండలం పెగడపల్లి గ్రామంలో స్థానిక బీఆర్ఎస్ పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటా ప్రచారాన్ని నిర్వహించి బీఆర్ఎస్ పార్టీనీ కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో సీఎం కేసీఆర్ పెద్దపల్లిలో ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డిలు అభివృద్ధి సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నారన్నారు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండే దాసరి మనోహర్ రెడ్డి ని మరోసారి గెలిపిస్తే మరింత అభివృద్ధి జరుగుతుందని గుర్తించాలన్నారు రానున్న ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి దాసరి మనోహర్ రెడ్డి గారిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ వంగళ తిరుపతి రెడ్డి ఎంపీపీ నూనేటి సంపత్ యాదవ్ బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గౌడుగు రాజకొమురయ్య యాదవ్ ఎంపీటీసీ సుంకం నిర్మల-మల్లారెడ్డి రైతు సమన్వయ సమితి మండలాధ్యక్షుడు నిదానపురం దేవయ్య యూత్ మండలాధ్యక్షుడు నూనేటి కుమార్ గ్రామ శాఖ అధ్యక్షుడు కూకట్ల నవీన్ రైతు సమన్వయ సమితి గ్రామ శాఖ అధ్యక్షుడు జంగ రమణారెడ్డి గౌడ సంఘం అధ్యక్షులు ఈరగోని సదయ్య నాయకులు వీరగోని సదయ్య పత్తి భాస్కర్ రెడ్డి క్రిష్ణా రెడ్డి బీఆర్ఎస్ ముఖ్య నాయకులు యువకులు పాల్గొన్నారు.

# ఆది కైలాశ్ పర్వతాన్ని దర్శించుకున్న ప్రధాని మోదీ

## -పరమశివుడికి ప్రత్యేక పూజలు..

**టీ మీడియా, అక్టోబర్ 12, ఉత్తరాఖండ్ :** ప్రధాని నరేంద్ర మోదీ ఒకరోజు పర్యటన నిమిత్తం గురువారం ఉత్తరాఖండ్ చేరుకున్నారు. పితౌరాగఢ్ జిల్లాలోని పార్వతీ కుండ్ దగ్గర పరమశివుడి దేవాలయాన్ని ప్రధాని సందర్శించారు. స్థానిక సంప్రదాయ దుస్తుల్లో మోదీ అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఢమరుకం, శంఖానాదాలతో పరమేశ్వరుడిని అర్చించారు. అనంతరం పరమశివుడు కొలువైన ఆది కైలాశ్ పర్వతాన్ని ప్రధాని మోదీ సందర్శించారు. జగదేశ్వర్ ధామ్, సరిహద్దున ఉన్న గుంజీ గ్రామానికి కూడా వెళ్లారు. పితౌరాగఢ్ జిల్లాలోని పార్వతీ కుండ్ దగ్గర పరమశివుడి దేవాలయాన్ని ప్రధాని సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతోనూ సమావేశమయ్యారు. ప్రధానమంత్రి సంప్రదాయ సంగీత వాయిద్యాలను కూడా వాయించారు. గ్రామస్తులు తయారు చేస్తున్న స్థానిక ఉత్పత్తులను ప్రధాని మోదీ ప్రశంసించారు.ప్రధాని మోదీ ఈ పర్యటనలో రూ.4200 కోట్ల విలువైన పలు అభివృద్ధికార్యక్రమాలకు శంకుస్థాపన చేస్తారు. అనంతరం బహిరంగ సభలో ప్రసంగిస్తారు.ప్రధాని మోదీ ఈ పర్యటనలో రూ.4200 కోట్ల విలువైన పలు అభివృద్ధికార్యక్రమాలకు శంకుస్థాపన చేస్తారు.



# ఆస్ట్రేలియా ఆలౌట్.. కంగారులను చిత్తుగా ఓడించిన సౌతాఫ్రికా

**టీ మీడియా, అక్టోబర్ 12, లఖ్‌నవూ:** ప్రపంచకప్‌లో భారత్‌తో జరిగిన తొలి మ్యాచ్‌లో పరాజయం పాలైన ఆసీస్‌కు రెండో మ్యాచ్‌లోనూ షాక్ తగిలింది. సౌతాఫ్రికాతో జరిగిన మ్యాచ్‌లో ఆసీస్ ఘోర ఓటమిని చవిచూసింది.తొలుత బ్యాటింగ్ చేసిన దక్షిణాఫ్రికా నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 311 పరుగులు చేసింది. ఈ భారీ లక్ష్యఛేదనలో దక్షిణాఫ్రికా బౌలర్ల ధాటికి 40.5 ఓవర్లలో 177 పరుగులకే ఆసీస్ కుప్పకూలింది. దీంతో దక్షిణాఫ్రికా 134 పరుగుల తేడాతో ఘన విజయం అందుకుంది. ఆసీస్ బ్యాటర్లలో మార్నస్ లబుషేన్ (46) టాప్ స్కోరర్. ఓపెనర్లు మిచెల్ మార్ష్ (7), డేవిడ్ వార్నర్ (13), వన్‌డౌన్ బ్యాటర్ స్టీవ్ స్మిత్ (19), జోష్ ఇంగ్లిస్ (5), గ్లెన్ మ్యాక్స్‌వెల్ (3), మార్కస్ స్టాయినిస్ (5) వరుసగా పెవిలియన్ బాటపట్టారు. దీంతో ఆసీస్ 70 పరుగులకే ఆరు వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఈ క్రమంలో లబుషేన్, మిచెల్ స్టార్క్ (27బీ 51 బంతుల్లో 3 ఫోర్లు) నిలకడగా ఆడి వికెట్ల పతనాన్ని ఆపారు. ఈ జోడీ ఏడో వికెట్‌కు 69 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పింది. పాట్ కమిన్స్ (22), ఆడమ్ జంపా (11) పరుగులు చేశారు. సౌతాఫ్రికా బౌలర్లలో రబాడ, కేశవ్ మహారాజ్ 2, షంసి 2, మార్కో జాన్సన్ 2, ఎంగిడి ఒక వికెట్ పడగొట్టారు. 312 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఆసీస్ మొదటి ఓవర్లు నిలకడగానే ఆడింది. తర్వాత వరుసగా వికెట్లు కోల్పోయింది. మార్కో జాన్సన్ వేసిన ఆరో ఓవర్‌లో మిచెల్ మార్ష్ బావుమాకు క్యాచ్ ఇచ్చాడు. ఎంగిడి వేసిన తర్వాతి ఓవర్‌లో వార్నర్.. వాండర్ డసెన్‌కు చిక్కాడు. రబాడ తన వరుస ఓవర్లలో స్మిత్, ఇంగ్లిస్‌ను పెవిలియన్‌కు పంపాడు. స్మిత్ వికెట్ల ముందు దొరికిపోగా.. జోష్ ఇంగ్లిస్‌ను కూడా ఔటయ్యాడు. జాన్సన్ బౌలింగ్‌లో కమిన్స్ మూడు ఫోర్లు బాదాడు.




క్లీన్‌బౌల్డయ్యాడు. మ్యాక్స్‌వెల్.. కేశవ్ మహారాజ్ బౌలింగ్‌లో అతడికే రిటర్న్ క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. స్టాయినిస్.. రబాడ బౌలింగ్‌లో వికెట్‌కీపర్ డికాక్‌కు క్యాచ్ ఇచ్చాడు. ఈ క్రమంలో లబుషేన్ స్టార్క్‌తో జత కట్టాడు. వీరు నిలకడగా ఆడి పరుగులు రాబట్టారు. మార్కో జాన్సన్ బౌలింగ్‌లో స్టార్క్.. డికాక్‌కు క్యాచ్ ఇచ్చాడు. మహారాజ్ వేసిన తర్వాత ఓవర్‌లోనే లబుషేన్ షంసి ఒకే ఓవర్‌లో కమిన్స్, హేజిల్‌వుడ్ (2)ను ఔట్ చేయడంతో ఆసీస్ ఆలౌటైంది.టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన సౌతాఫ్రికా (%ూశీబ్ష్ర ూటతీఱఝ%) నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 311 పరుగులు చేసింది. లంకపై సెంచరీ బాదిన ఓపెనర్ క్వింటన్ డికాక్ (109బీ 106 బంతుల్లో 8 ఫోర్లు, 5 సిక్స్‌లు) ఈ మ్యాచ్‌లోనూ శతకం సాధించాడు. ఐడెన్ మార్క్రమ్ (56బీ 44 బంతుల్లో 7 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ శతకంతో మెరిశాడు. తెంబా బావుమా (35బీ 55 బంతుల్లో 2 ఫోర్లు), వన్‌డౌన్ బ్యాటర్ వాండర్ డసెన్ (26బీ 30 బంతుల్లో 2 ఫోర్లు), హెన్రిచ్ క్లాసెన్ (29బీ 27 బంతుల్లో 3 ఫోర్లు) తక్కువ స్కోరుకే పెవిలియన్ చేరారు. ఆఖర్లో మార్కో జాన్సన్ (26బీ 22 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్), డేవిడ్ మిల్లర్ (17బీ 13 బంతుల్లో) దూకుడుగా ఆడటంతో స్కోరు 300 దాటింది. ఆసీస్ బౌలర్లలో మ్యాక్స్‌వెల్ 2, మిచెల్ స్టార్క్ 2, హేజిల్‌వుడ్, కమిన్స్, ఆడమ్ జంపా ఒక్కో వికెట్ పడగొట్టారు.